

కబ్జా చేసి బండలను పాతిన ఎర్రిస్వామి

వైసీపీ కబ్జాలో అమరావతి నగర్

ఆదోని రూరల్, జూలై 10 :

వైసీపీ నాయకుడు అమరావతి నగర్‌ను పూర్తిగా స్వాహా చేశాడు. బంగారం కన్నా విలువైన ప్రభుత్వ స్థలాలపై ఆయన కన్నుపడింది. ప్రైవేట్ స్థలాలైతే యజమానులను బెదిరించడం, పంచాయితీలు చేయడం ఇతని దినచర్య. ఆలూరు మండలం మొలగవల్లి గ్రామానికి చెందిన ఎర్రిస్వామి మొదట్లో అతి సామాన్యుడు. 30 సంవత్సరాల క్రితం ఆదోనికి వలస వచ్చాడు. వైసీపీ మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పంచన చేరాడు. వైసీపీ అధికారంలోకి వచ్చాక అటు అధికార బలం, ఇటు సాయిప్రసాద్ రెడ్డి అండ అతనికి కలిసి వచ్చాయి. భూకబ్జాలకు, అక్రమాలకు, దౌర్జన్యాలకు, బెదిరింపులకు అంతే లేకుండాపోయింది. వైసీపీలో ద్వితీయ శ్రేణి నాయకుడిగా అనతి కాలంలోనే కోట్లకు పడగలెత్తాడు. సాయిప్రసాద్‌రెడ్డి అంటే ఎర్రిస్వామి, ఎర్రిస్వామి అంటే సాయిప్రసాద్‌రెడ్డి అనే స్థాయికి ఎదిగాడు.

- పేదల కొట్టాలను కూల్చేశారు
- ఖాళీ స్థలాలన్నీ అనుచరులకే కేటాయింపు
- మున్సిపల్ స్థలంలో ప్లాట్లు
- మాజీ ఎమ్మెల్యే అనుచరుడు బాగోతం



మొలగవల్లికి చెందిన వైసీపీ నాయకుడు ఎర్రిస్వామి ప్రస్తుతం ఆదోనిలోని అమరావతి నగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఇక్కడ ప్రభుత్వ భూమి పెద్ద మొత్తంలో ఉంది. దీన్నంతా కబ్జా చేయడానికి ఎర్రిస్వామి పక్కా స్కెచ్ వేశాడు. గత తెలుగుదేశం అమరావతి నగర్‌లో కల్లుబావి సర్వే నెం. 175, 176, 177లో వందల మంది పేద ప్రజలకు ఇంటి పట్టాలు మంజూరు చేసింది. 2024 సార్వత్రిక ఎన్నికలకు రెండు నెలలకు ముందు ఎర్రిస్వామి ఈ సర్వే నెంబర్లలో ఉన్న ఖాళీ స్థలాలను కబ్జా చేయడంతో పాటు, నివాసం ఉన్న వారిని సైతం అనుచరులతో అధికారుల పేరు చెప్పి ఎకరాకుపైగా ఖాళీ చేయించి వైసీపీ నాయకులకు, కార్యకర్తలకు కట్టబెట్టాడు. బసాపురం రహదారిలో ఉన్న అమరావతి నగర్‌లో సర్వే నెం. 181/2, 182, 345 సర్వే నెంబరులో పేద ప్రజలకు భూ పంపిణీ కోసం కొంత భూమిని అప్పటి టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 2004లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పట్టణ ప్రజల కోసం రాజీవ్ గృహకల్ప కింద ప్రజలకు మూడు అపార్టుమెంట్లను ఏర్పాటు చేసింది. అయితే ఇంకా దాదాపు రెండెకరాలపైనే ఉన్న ఈ ఖాళీ స్థలంలో ముళ్లకంపలు ఉండడంతో మున్సిపల్ అధికారులు శుభ్రం చేయించి చెట్లను నాటారు. ఈ స్థలంపై వైసీపీ నాయకుడు ఎర్రిస్వామి కన్ను పడింది. తన అనుచరులతో కలిసి దాదాపు ఎకరాకుపైగానే స్థలంలో ఒకటిన్నర సెంటు చొప్పున 66 ప్లాట్లను వేసి రాళ్లు కూడ పాతేసి ఆ రాళ్లకు బ్లూ కలర్ వేశాడు. తమను నమ్మించి ముందుగా ఖాళీ స్థలంలో అధికార బలంతో చెట్లను నాటించి తరువాత కబ్జా చేసి ఎర్రిస్వామి ప్లాట్లు వేసుకొని తన అనుచరులకు కట్టబెట్టాడని, ఇతరులకు అమ్ముకున్నాడని స్థానికులు విమర్శిస్తున్నారు. ప్రస్తుతం వైసీపీ కబ్జాదారులు ఆ స్థలాన్ని స్వాధీన పరుచుకోవడానికి కుట్ర చేస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. మరీ ఏ అధికారంతో ప్రభుత్వ మున్సిపల్ స్థలంలో ప్లాట్లు వేశాడో అంతు చిక్కడం లేదని, అధికారులే దీనికి సమాధానం చెప్పాలని, ఈ స్థలమేగాక కాలనీలో చాలా ప్రభుత్వ స్థలాలను ఎర్రిస్వామి కబ్జా చేశాడని స్థానికులు విమర్శిస్తున్నారు. ఎర్రిస్వామి దెబ్బకు చాలామంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమ స్థలాలను ఎర్రిస్వామికి అప్పజెప్పి ఇచ్చినంత తీసుకొని వెళ్లిపోయారు. సుబ్రమణ్యం స్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఆలూరు రహదారిలోని ఓ వెంచర్ యజమానిని బెదిరించి ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆదోని నడిబొడ్డున ఎన్జీఓఎస్‌ను బెదిరించి అతి తక్కువకే 99 సంవత్సరాలపాటు స్థలాన్ని లీజుకు రాయించుకొని అక్కడ వైసీపీ కార్యాలయాన్ని నిర్మించడంలో ఎర్రిస్వామి కీలక పాత్ర పోషించాడు. ఈ భవనాన్ని అనధికారికంగా నిర్మించారని మున్సిపల్ అధికారులు నోటీసులు కూడా ఇచ్చారు. ఇప్పటికైనా భూకబ్జాలపై చర్యలు తీసుకోవాలని సర్వత్రా డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి.



అమరావతి నగర్ మున్సిపల్ స్థలంలో ప్లాట్లు వేసి నాటిన రాళ్లు

కొట్టం కూల్చి స్థలం కబ్జా చేశారు



అమరావతి నగర్‌లో 2019లో గంగమ్మ వద్ద రూ.2లక్షలు పెట్టి మూడు సెంట్ల స్థలం కొన్నాను. కొట్టం వేసుకున్నాను. మున్సిపాలిటీ అధికారుల అనుమతితో కొళాయి కూడ వేసుకున్నా. ఆరు నెలల క్రితం కొట్టం ఖాళీ చేయాలని, లేకపోతే కూల్చేస్తామంటూ, వైసీపీ నాయకుడు ఎర్రిస్వామి అతని అనుచరులు పీరా, రవి ఎక్స్‌కవేటర్ తీసుకొచ్చి బలవంతంగా నా స్థలాన్ని కబ్జా చేశాడు. నా స్థలం నాకు కావాలి.

- తాయమ్మ, అమరావతి నగర్

మున్సిపల్ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలి



అమరావతి నగర్‌లో మున్సిపల్, ప్రభుత్వ స్థలంలో ఎర్రిస్వామి రాళ్లు నాటి ప్లాట్లు వేసి స్థలాన్ని కబ్జా చేశాడు. ఇప్పుడు వైసీపీ నాయకుడు కబ్జా చేసిన స్థలంలో ఇల్లు కట్టుకోవాలని చూస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు మేల్కొని మున్సిపల్ స్థలాన్ని స్వాధీనం చేసుకొని స్థానికుల కోసం పార్కును ఏర్పాటు చేయాలి.

- మీనాక్షమ్మ, అమరావతి నగర్

పార్కు స్థలం కబ్జా చేశాడా? విచారిస్తా



ఎర్రిస్వామి మున్సిపల్ స్థలాన్ని కబ్జా చేసి ప్లాట్లు వేశాడా? అది తప్పు. వెంటనే విచారించి చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ స్థలాన్ని స్వాధీన పరుచుకుంటాం. ఇలాంటి చర్యలు పునరావృత్తం కాకుండా చూస్తాం.

- రామచంద్రరెడ్డి, మున్సిపల్ కమిషనర్, ఆదోని

సీఎం చంద్రబాబును కలిసిన తిక్కారెడ్డి, మీనాక్షి నాయుడు



చంద్రబాబుతో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

కర్నూలు అర్బన్ /ఆదోని, జూలై 10: రాష్ట్ర ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడును జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడులు బుధవారం విజయవాడలో కలిశారు. ఈ సందర్భంగా మంత్రాలయం, ఆదోని నియోజకవర్గాల అభివృద్ధితో పాటు జిల్లాలో టీడీపీకి సంబంధించిన పలు అంశాలపై వారు చంద్రబాబుతో చర్చించారు. ఈ సందర్భంగా తిక్కారెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని పశ్చిమ ప్రాంతం నుంచి వలసలు ఎక్కువగా ఉన్నాయని వాటిని నివారించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. తాగు, సాగునీటి సమస్యలపై శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేసిన వారిని ప్రోత్సహించాలని తిక్కారెడ్డి చంద్రబాబు ఎదుట విజ్ఞప్తి చేశారు. పింఛన్ల పంపిణీ, ఉచిత ఇసుక, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, డీఎస్సీ నోటిఫికేషన్ తదితర అంశాలను అధికారుల సహకారంతో ప్రజల్లోకి తీసుకెళ్లామని వివరించారు. తిక్కారెడ్డి వెంట టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చిన్న బసప్ప కూడా ఉన్నారు. ఆదోని నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపి, అన్ని విధాల అభివృద్ధి చేయాలని మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు చంద్రబాబను కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన చంద్రబాబు ఆదోని అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో కృషి చేస్తానని తెలిపారు.



సీఎం నారా చంద్రబాబు నాయుడుతో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మీనాక్షినాయుడు

జిల్లాలో 2,600 మంది ఉపాధ్యాయుల కొరత

- 1050 పాఠశాలల్లో నాడు-నేడు పనులు పెండింగ్
- డీఈవో శామ్యూల్



ఉపాధ్యాయుల శిక్షణా కార్యక్రమంలో ప్రసంగిస్తున్న డీఈఓ

పత్తికొండ, జూలై 10: జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో 2,600 మంది ఉపాధ్యాయుల కొరత ఉన్నారని డీఈఓ, ఇన్‌చార్జ్ ఆర్జేడీ శామ్యూల్ వెల్లడించారు. పత్తికొండ పట్టణంలోని బాలుర హైస్కూల్‌లో ఉపాధ్యాయులకు జరుగుతున్న శిక్షణా కార్యక్రమానికి బుధవారం ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఈఓ శామ్యూల్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు అధికంగా పేద వర్గాలకు చెందిన వారే ఉంటారన్నారు. వారికి నాణ్యమైన బోధనతో పాటు విద్యా సామర్థ్యాన్ని అందిస్తే భవిష్యత్‌లో ఉన్నతస్థాయికి వెళ్తారన్నారు. అనంతరం పత్తికొండ మండలంలోని పందికోన పాఠశాలలో నిలిచిపోయిన నాడు-నేడు పనులను ఆయన పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా 1,050 పాఠశాలల్లో పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. నిధుల కొరత ఉందని సర్దుబాటు చేసి రెండు నెలల్లో పనులు పూర్తి చేస్తామన్నారు. ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలలకు ఇతర స్కూళ్ల నుంచి టీచర్లను సర్దుబాటు చేస్తున్నామన్నారు. కొత్త డీఎస్సీ నుంచి ఉపాధ్యాయులు ఎంపికై వస్తే టీచర్ల సమస్య పరిష్కారమవుతుందని తెలిపారు. డీఈఓ వెంట పత్తికొండ ఎంఈఓ రమేష్ తదితరులు ఉన్నారు.

లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలి

- స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి
- కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ధర్నా

కర్నూలు(న్యూసిటీ), జూలై 10: కేంద్ర ప్రభుత్వం 44 పాత చట్టాలను రద్దు చేస్తూ కార్మికులను కట్టుబానిసలుగా చేయడానికి తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆల్ ఇండియా కమిటీ పిలుపులో భాగంగా బుధవారం కలెక్టరేట్ ముందు డిమాండ్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడుతూ స్కీం వర్కర్లు అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. అసంఘటిత రంగ హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి సమగ్రమైన వేతన చట్టాన్ని రూపొందించాలన్నారు. హిట్ అండ్ రన్ పేరుతో తెచ్చిన చట్టం వల్ల కార్మికులకు తీవ్ర నష్టం జరుగుతున్నదన్నారు. గత ప్రభుత్వం అనుసరించిన విధానాలు కాకుండా లేబర్ బోర్డు ద్వారా కార్మికులకు ప్రయోజనం కలిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి విజయ్, బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకుడు మహేష్, మద్దిలేటి, యాకోబు, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకుడు ప్రభాకర్, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు రాధిక పాల్గొన్నారు.



కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న కార్మికులు, సీఐటీయూ నాయకులు

సీసీఆర్‌సీ కార్డులను అందజేయండి

- అగ్రి టెస్టింగ్ ల్యాబుల్లో పరీక్షలు పెరగాలి
- కలెక్టర్ పి. రంజిత్ బాషా

కర్నూలు(కలెక్టరేట్), జూలై 10: జిల్లాలో కేటాయించిన మేరకు కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులను వేగవంతంగా అందజేయాలని జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వ్యవసాయ, ఉద్యాన, మైక్రో, ఇరిగేషన్ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీఆర్‌సీ కార్డులు జిల్లాకు 22,235 లక్ష్యం కాగా, ఇప్పటి వరకు వంద కార్డులు అందజేశారన్నారు. సీజన్ తర్వాత ఇచ్చి లాభం ఏముందని అధికారులను ప్రశ్నించారు. ఇంటిగ్రేటెడ్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్స్ ద్వారా కేవలం 308 పరీక్షలు చేశారని, వీటి సంఖ్య చాలా పెరగాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. వేరుశనగ విత్తనాలకు డిమాండ్ ఉన్నందున అవసరమైన పరిమాణంలో విత్తనాల సరఫరా కోసం వ్యవసాయ శాఖ కమిషనర్‌కు డీఓ లెటరు పెట్టాలని డీఏవోను ఆదేశించారు. ఈక్రాప్‌లో వ్యవసాయశాఖ ద్వారా రైతు పొందిన లబ్ధి వివరాలు, క్రాప్ లోన్ వివరాలు, ఇరిగేషన్ సోర్స్, సర్వేనెంబరు, విస్తీర్ణం, పట్టాదారు, పంటల వారీగా నివేదికలు తదితర వివరాలన్నీ జిల్లా, మండల గ్రామం వారీగా రూపొందించాలని ఆదేశించారు. డీఆర్‌డీఏ, డీసీవోలతో సమావేశం నిర్వహించి సహకారపరపతి సంఘాలకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని ఏపీఎంఐపీ పీడీని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, ఏపీఎంఐపీ పీడీ ఉమాదేవి, జిల్లా హార్టికల్చర్ అధికారి రామాంజనేయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ పి. రంజిత్ బాషా, హాజరైన అధికారులు

143 జీఓ రద్దుకు కృషి చేస్తాం

- ఏపీ హంస సర్వసభ్య సమావేశంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత

కర్నూలు(హాస్పిటల్), జూలై 10: వైద్య ఆరోగ్యశాఖని నిర్వీర్యం చేసే జీఓ.నెం.143ను అసెంబ్లీలో చర్చించి రద్దు చేసేందుకు కృషి చేస్తామని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి హామీ ఇచ్చారు. బుధవారం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలోని ఓల్డ్ సీఎల్‌జీలో ఏపీ హంస అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అరవపాల్ ఆధ్వర్యంలో కర్నూలు తాలుకా సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఎంపీ ల్యాండ్ నిధులను విడుదల చేసి ఏపీ హంసా భవన నిర్మాణానికి సహకరిస్తానని హామీనిచ్చారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అరవపాల్ మాట్లాడుతూ 2011 నుంచి కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ పెండింగ్‌లో ఉందని అర్హత ఉన్న ఉద్యోగులకు న్యాయం చేసేలా కృషి చేస్తామన్నారు. పీఆర్‌సీ విషయంలో ఉద్యోగుల సమావేశంలో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రఘుబాబు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాసులు, నగర అధ్యక్షుడు టి. గోవిందు, అసోసియేట్ అధ్యక్షుడు వెంకటస్వామి, నర్సింగ్ అసోసియేషన్ నాయకురాలు మంజుల, డ్రైవర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు, ల్యాబ్ టెక్నీషియన్ సంఘం నాయకులు రఘుబాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత

పాలిసెట్ తుది విడత కౌన్సిలింగ్

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 10: కర్నూలు శివారులోని బి.తాండ్రపాడు జీపీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 11వ తేదీ నుంచి 13వ తేదీ వరకు తుది విడత పాలిసెట్ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీఎస్ఎస్ ప్రసాద్ బుధవారం తెలిపారు. పాలిసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు ఈ నెల 13వ తేదీ వరకు కౌన్సిలింగ్ ఫీజు వెబ్‌సైట్ ద్వారా చెల్లించి హాజరు కావాలన్నారు. నమోదు రుసుం ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు రూ.250, ఓసీ, బీసీ విద్యార్థులకు రూ.700 చెల్లించాలన్నారు. విద్యార్హతలో ధ్రువపత్రాల పరిశీలకు హాజరయ్యే విద్యార్థులు కౌన్సిలింగ్ ఫీజు రసీదు, పాలిసెట్ హాల్ టికెట్, ర్యాంకు కార్డు, పదో తరగతి మార్క్స్ మెమో, 4 నుంచి 10వ తరగతి స్టడీ సర్టిఫికెట్లు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రం ఈడబ్ల్యూఎస్ ఒరిజినల్స్‌తో పాటు రెండు సెట్లు జిరాక్స్ తీసుకుని వెరిఫికేషన్‌కు హాజరు కావాలన్నారు. వెరిఫికేషన్ చేసుకున్న విద్యార్థులు నిబంధనల ప్రకారం జూలై 11 నుంచి 14వ తేదీ వరకు కళాశాలలకు ఆప్షన్లు ఇచ్చుకోవాలన్నారు. ఎస్టీ అభ్యర్థులు ధ్రువపత్రాల పరిశీలన, బి. తాండ్రపాడు జీపీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మాత్రమే జరుగుతాయన్నారు.

ఇద్దరు ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలు

కర్నూలు(న్యూసిటీ), జూలై 10: జిల్లా పరిషత్ పరిధిలో పని చేస్తున్న ఇద్దరు ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటున్నట్లు సీఈఓ జి. నాసరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హొళగుంద జడ్పీ పాఠశాలలో పని చేస్తున్న జూనియర్ అసిస్టెంట్ కే. శ్రీనివాసమూర్తి, కోడుమూరు జడ్పీ పాఠశాల(బాలికలు)లో పని చేస్తున్న రికార్డు అసిస్టెంటు నాగరాజు విధులకు గైర్హాజరు అయ్యారని సీఈఓ పేర్కొన్నారు. శ్రీనివాసమూర్తి 10.08.2018 నుంచి, నాగరాజు 07.12.2022 నుంచి విధులకు గైర్హాజరయ్యారని, జడ్పీ కార్యాలయం నుంచి వీరికి షోకాజు నోటీసు, చార్జీ మెమో జారీ అయ్యాయని తెలిపారు. ఉద్యోగులు నేటి వరకు ఎలాంటి సంజాయిషీ సమర్పించలేదన్నారు. ఉద్యోగులు తక్షణమే జిల్లా పరిషత్ పరిపాలన భవనంలో హాజరు కావాలని లేని పక్షంలో ప్రభుత్వ ఉత్తర్వు నెంబరు 127, తేదీ: 15.9.2017, సీసీఏ రూల్స్ ప్రకారం తదుపరి క్రమశిక్షణ చర్యలు ఉంటాయని సీఈఓ పేర్కొన్నారు.

నగర పాలక సంస్థ డీఈఈ సరెండర్

కర్నూలు(న్యూసిటీ), జూలై 10: నగర పాలక సంస్థలో పని చేస్తున్న డీఈఈ గోపాలక్రిష్ణను ఇంజనీర్ ఇన్ చీఫ్‌కు సరెండర్ చేస్తూ కమిషనర్ ఏ. భార్గవతేజ ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల ఆంధ్రజ్యోతిలో ..ఓ డీఈఈ నిర్వాకం.. అనే కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఈ మేరకు డీఈఈని సరెండర్ చేశారు. తదుపరి ఈఎన్‌సీ కార్యాలయం నుంచి ఆయనకు పోస్టింగ్ ఇవ్వనున్నారు.

మిద్దె పైనుంచి పడి వ్యక్తి మృతి

కొలిమిగుండ్ల, జూలై 10: పెంపుడు పావురాలకు గింజలు పెట్టడానికి మిద్దె పైకి వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు కిందపడి మరణించాడు. ఈ సంఘటన మండలంలోని అంకిరెడ్డిపల్లె గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన దూదేకుల చిన్న కుళ్లాయప్ప(68) ఇంటి మేడపై ఉన్న పావురాలకు గింజలు, నీళ్లు పెట్టడానికి వెళ్లి కాలుజారి కిందపడ్డాడు. తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయిన కుళ్లాయప్పను సుమారు గంటపాటు కుటుంబ సభ్యులెవ్వరూ గమనించలేదు. ఆ తర్వాత కుటుంబ సభ్యులు తాడిపత్రి ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. సీఐ గోపీనాథ్‌రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మా పొలం మాకు ఇప్పించండి

- వృద్ధ దంపతుల వేడుకోలు



తహసీల్దార్‌కు విన్నవించుకుంటున్న వృద్ధ దంపతులు

చిప్పగిరి, జూలై 10: మా పొలం ఇప్పించి న్యాయం చేయాలని చిప్పగిరి మండలం బంటనహాల్ గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు రెవెన్యూ అధికారులను వేడుకుంటున్నారు. కార్యాలయాల చుట్టూ ఏళ్లతరబడి తిరుగుతున్నా తమకు న్యాయం జరగడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సర్వే నంబర్ 145లోని భూమిని అడంగల్‌లో ఇతరుల పేరుమీద మార్చుకుని అన్యాయం చేశారని బంటనహాల్ గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు గోవిందమ్మ, లక్ష్మీదేవి మంగళవారం తహసీల్దార్ ఎదుట వాపోయారు. తమకు న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై తహసీల్దార్ పద్మ మాట్లాడుతూ బంటనహాళ్ గ్రామంలో సర్వే నెంబర్ 145లో రెండు ఎకరాల పొలం ముగ్గురికి సమభాగం ఉందని, వీరిలో ఒకరు నిబంధనలకు విరుద్ధంగా తన పేరు మీద మార్చుకొని భూమిని విక్రయించిందన్నారు. అప్పటి అధికారులు రికార్డులు తారుమారు చేయడం వల్లే ఇలా జరిగిందన్నారు. ఉన్నతాధికారులకు నివేదికల పంపామని, ఆర్డీఓ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

పకడ్బందీగా పొలంబడి

కర్నూలు(అగ్రికల్చర్), జూలై 10: పంటల సాగులో రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించడానికి గతం కంటే సమర్థవంతంగా పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు కర్నూలు జిల్లా వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పొలంబడి కార్యక్రమాన్ని మొక్కుబడిగా నిర్వహించారు. అయితే ప్రస్తుత ఖరీఫ్ నుంచి పొలంబడి కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించడంతో గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీసు (గ్యాప్) కింద ఈ పొలం బడి కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తామని జేడీ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో డిప్యూటీ తహసీల్దార్ మృతి

కర్నూలు, జూలై 10: నంద్యాల సివిల్ సప్లయ్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న వీణా కుమార్(42) అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు మూడో పట్టణ సీఐ మురళీధర్ రెడ్డి తెలిపారు. వీణా కుమార్ స్థానిక గణేష్ నగర్‌లో నివాసముంటున్నాడు. ఓ బార్ వద్ద అపస్మారక స్థితిలో పడి ఉండగా.. స్థానికులు అతన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రభుత్వ వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. గుండెపోటుతో మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి తల్లి జ్యోతి తన కుమారుడు వీణాకుమార్ మృతిపై విచారణ చేపట్టాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు.


విద్యార్థిని పరామర్శించిన అధికారులు

- నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులకు మెమోలు
- మహిళా శిశు సంక్షేమ శాఖ ఈఓ పి.వెంకటలక్ష్మమ్మ



కర్నూలు జీజీహెచ్‌లో బాలుడిని పరామర్శిస్తున్న అధికారులు, వైద్యులు

ఆదోని రూరల్, జూలై 10: విద్యుదాఘాతానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆదోని మండలం ఇస్వీ గ్రామానికి చెందిన అంగన్‌వాడి విద్యార్థి హుసేనిని జిల్లా అధికారులు బుధవారం పరామర్శించారు. ఇస్వీ గ్రామానికి చెందిన ఈరమ్మ, బసవరాజుల ఐదేళ్ల కుమారుడు స్థానిక అంగన్‌వాడీ-2 సెంటర్‌కు మంగళవారం వెళ్లాడు. అయితే మరో విద్యార్థితో కలసి హుసేని బహిర్భూమికి వెళ్లాడు. ఈ క్రమంలో సమీపంలో ఉన్న 11కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను బాలుడు పట్టుకోవడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. దీంతో ఆ బాలుడిని మెరుగైన వైద్య చికిత్సల కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడిని మహిళా శిశు సంక్షేమ శాఖ ఈఓ పి.వెంకటలక్ష్మమ్మ బుధవారం పరామర్శించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలుడు హుసేనికి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు. బాలుడి ఆరోగ్యంపై ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని తల్లిదండ్రులకు ఆమె భరోసానిచ్చారు. ప్రమాద ఘటనపై ఆమె విచారం వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అన్ని సెంటర్లలో ముందస్తు చర్యలు తీసుకుంటామన్నారు. కాగా విధుల్లో నిర్లక్ష్యం వహించిన అంగన్‌వాడీ కార్యకర్త జయలక్ష్మి, సూపర్‌వైజర్, సీడీపీఓ, విద్యుత్ లైన్‌మెన్, ఏఈలకు మెమోలు ఇచ్చినట్లు వెల్లడించారు.



అప్రోచ్ కాలువలో గాలిస్తున్న ఏపీడీఆర్ఎఫ్ బృందం




ఎస్పీకి చేతులెత్తి మొక్కుతున్న వాసంతి బంధువులు



రోదిస్తున్న వాసంతి తల్లి సుజాత

ముచ్చుమర్రిలో ముమ్మర గాలింపు

- రెండో రోజూ లభించని వాసంతి ఆచూకీ
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఎంపీ, ఎమ్మెల్యే, ఎస్పీలు
- తరలివచ్చిన చుట్టుపక్క గ్రామాల ప్రజలు
- అప్రోచ్ కాలువలో రెస్క్యూటీం ముమ్మర గాలింపు
- రంగంలోకి ఏపీడీఆర్ఎఫ్ బలగాలు



నందికొట్కూరు/ పగిడ్యాల, జూలై 10: అభం శుభం తెలియని చిన్నారి వాసంతి మిస్సింగ్ హిస్టరీ తేలడం లేదు. రెండు రోజులుగా ముచ్చుమర్రి ఎత్తిపోతల అప్రోచ్ కాలువలో పోలీసులు, గజ ఈతగాళ్లు, రెస్క్యూటీం చేస్తున్న ప్రయత్నాలు కొనసాగుతూనే ఉన్నాయి. ముమ్మరంగా గాలింపు చర్యలు జరుగుతున్నా చిన్నారి వాసంతి జాడ తెలియలేదు. నాలుగు రోజుల క్రితం ఆదివారం పగిడ్యాల మండలం పాతముచ్చుమర్రి గ్రామంలో బాలిక వాసంతి అదృశ్యమైంది. తల్లిదండ్రుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు ముగ్గురు మైనర్ బాలురను అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కస్టడీలో ఉన్న ముగ్గురు మైనర్ బాలురు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు రెండు రోజులుగా ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం అప్రోచ్ కాలువలో గాలిస్తున్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు నిరంతరాయంగా గాలింపు చర్యలు చేపట్టినా కూడా నిరాశే మిగిలింది. ఘటనా స్థలానికి నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి, నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించి బాధితులకు భరోసానిచ్చారు. తమ బిడ్డకు న్యాయం చేయాలంటూ వాసంతి తండ్రి మద్దిలేటి, బంధువులు ప్రాధేయపడుతున్నారు. 'మీ కాళ్లు మొక్కుతాం సార్... మా పాపను మాకు అప్పగించం డి..' అంటూ వాసంతి తల్లిదండ్రులు ఎస్పీ రఘువీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డిల కాళ్లపై పడి వేడుకోవడం కలచివేసింది. బుధవారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో 15 మంది ఏపీడీఆర్ఎఫ్ బలగాలు రంగంలోకి దిగాయి. ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు, ఆర్డీఓ దాసు, ఎస్ఐ మహేంద్ర ఇతర అధికారులు ముచ్చుమర్రి వద్దే ఉంటూ పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.

మాట మార్చుతున్న మైనర్లు

బాలికను హతమార్చినట్లు పోలీసులు అనుమానిస్తున్న ముగ్గురు బాలురు ఒక్కోసారి ఒక్కోలా మాట మార్చుతూ పోలీసులకు చుక్కలు చూపిస్తున్నారు. మంగళవారం సాయంత్రం ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం అప్రోచ్ కాలువ వద్దకు మైనర్ బాలురను తీసుకెళ్లగా రెండు ప్రాంతాల్లో మృతదేహాన్ని వేసినట్లు చూపించారు. ఆ రెండు ప్రదేశాల్లో మంగళవారం, బుధవారం సాయంత్రం 5:30 గంటల వరకు వెతికారు. ఇదే క్రమంలో మైనర్ బాలురు తిరిగి ముచ్చుమర్రి పంపు హౌస్ ముందు భాగంలో శవాన్ని వేశామని చెప్పడంతో అక్కడ గాలింపు చర్యలు చేపట్టారు.

● మా బిడ్డకు పట్టిన గతే వారికి పట్టాలి

- మద్దిలేటి, వాసంతి తండ్రి

అభంశుభం తెలియని నా కూతురిని తీసుకెళ్లి చంపేందుకు వారికి చేతులు ఎలా వచ్చాయి. మాయమాటలు చెప్పి ఇక్కడికి తీసుకువచ్చి చంపేశారు. మా కూతురిని ఎలాగైతే చంపారో వారిని కూడా చట్టపరంగా ఉరి తీయాలి. అప్పుడే మాకు న్యాయం జరిగినట్లు.

● కంట తడిపెట్టిన నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి

నంద్యాల ఎంపీ బైరెడ్డి డాక్టర్ శబరి సంఘటన స్థలానికి చేరుకుని వాసంతి తండ్రి మద్దిలేటి, తల్లి సుజాతమ్మలను పరామర్శించారు. ఈ క్రమంలో తల్లిదండ్రులతో పాటు బంధువులు ఎంపీ ఎదుట కన్నీటి పర్యంతమయ్యారు. దీంతో ఎంపీ కూడా చలించిపోయి కంటతడి పెట్టారు. వాసంతి కోసం గాలింపు చర్యలు చేపడుతున్నారని, నిజానిజాలను పోలీసులు వెలికితీస్తారని, ఈ ఘటనలో నిందితులు ఎవరు ఉన్నా ఉపేక్షించేది లేదని ఆమె అన్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకు వారికి అండగా ఉంటామన్నారు.



కంటతడి పెడుతున్న నంద్యాల ఎంపీ బైరెడ్డి డాక్టర్ శబరి

● ఎంతటివారినైనా శిక్షిస్తాం

- గిత్తా జయసూర్య, ఎమ్మెల్యే, నందికొట్కూరు



పోలీసుల నుంచి వివరాలు సేకరిస్తున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య సంఘటన స్థలానికి చేరుకుని రూరల్ సీఐ విజయభాస్కర్, ఇతర ఎస్ఐలతో జరిగిన సంఘటనపై ఆరా తీశారు. వాసంతి తండ్రి మద్దిలేటి ఎమ్మెల్యే ఎదుట బోరున విలపించారు. ఎమ్మెల్యే ఆయనను పరామర్శించి ధైర్యంగా ఉండాలంటూ ఓదార్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ఘటన జరగడం బాధాకరమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిందితులపై చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

● జీర్ణించుకోలేకపోతున్నాం

బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే



బాధితులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి

బాలిక వాసంతిపై జరిగిన ఈ ఘటన జీర్ణించుకోలేకపోతున్నాం. శవం లభిస్తే కొంత వరకైనా తల్లిదండ్రులకు మన శాంతి ఉంటుంది. నిందితులు ఎవరైనా వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. రాష్ట్రాన్నే ఈ ఘటన కుదిపేసింది. రకరకాలుగా హింసించి చంపి ఉంటారని భావిస్తున్నాం. ఐదేళ్లుగా గ్రామంలో క్రమశిక్షణ లేకుండా పోయింది. ఐదేళ్లలో రౌడీలకు పెత్తనం ఇచ్చి సర్వనాశనం చేశారు. గ్రామంలో క్రమశిక్షణ తీసుకువచ్చేందుకు పోలీసుల సహకారం తీసుకుంటాం. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. 15 రోజుల్లో గ్రామ నిధులతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

అవినీతి వీఆర్వోని సస్పెండ్ చేయాలి

- అవినీతి సొమ్మును ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి
- కలెక్టరేట్ ఎదుట విద్యార్థి, ప్రజాసంఘాల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

కర్నూలు(కలెక్టరేట్), జూలై 10: అవినీతికి పాల్పడిన వీఆర్వోని వెంటనే సస్పెండ్ చేయాలని కోరుతూ బుధవారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నాయకులు కలెక్టరేట్ ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర, జిల్లా కార్యదర్శి నగేష్ మాట్లాడుతూ తలారి నుంచి వీఆర్వోగా పదోన్నతిపొందిన అధికారి రూ.కోట్లలో అక్రమాస్తులు సంపాదించాడన్నారు. అప్పట్లో వైసీపీ నాయకులతో అంటకాగుతూ ఇలా అక్రమాలకు పాల్పడ్డాడన్నారు. వైసీపీ నాయకుల అండదండలతో నగరంలో 300కుపైగా పట్టాలు ఇచ్చి అక్రమంగా రూ.కోట్లు దండుకున్నారని ఆరోపించారు. 11 ఎకరాల భూమిని ఒక కార్పొరేటర్ మాజీ ఎమ్మెల్యే అనుచరులు ఆన్‌లైన్ చేయించినందుకు రూ.25 లక్షలు లంచం తీసుకున్నాడన్నారు. వీకర్‌సెక్షన్ కాలనీలో ఒక వ్యక్తికి కొత్తగా పట్టా ఇచ్చినందుకు రూ.50వేలు, రాజీవ్ గృహకల్ప వద్ద ఎకరా కాలువ పోరంబోకు భూమిని ఆన్‌లైన్ చేసి పాస్‌బుక్ ఇచ్చినందుకు ఆ వ్యక్తి నుంచి రూ.10 లక్షలు లంచం తీసుకున్నాడని ఆరోపించారు. వాగు, పోరంబోకులో రెండు ఎకరాల భూమిని ఒక కార్పొరేటర్‌కు ఆన్‌లైన్ చేయించి పుస్తకాలు ఇచ్చినందుకు వీఆర్వో 9 సెంట్లు స్థలాన్ని అక్కడే తీసుకున్నాడని ఆరోపించారు. అవినీతి వీఆర్వోపై చర్యలు తీసుకోకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి హుశేన్‌బాషా, నగర అధ్యక్షుడు గౌతం, జిల్లా నాయకులు రామకృష్ణ, యేసు, నాయకులు నాగరాజు, చంద్ర, షేక్షావలి పాల్గొన్నారు.

అన్నా.. ఆ పోస్టు నాకు ఇవ్వాలి

ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులకు భారీగా డిమాండ్



మద్దికెర, జూలై 10: ఎన్డీయే కూటమి అధి కారంలో రావడంతో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులకు పోటీ పెరిగింది. పలు గ్రామాల్లో తమకంటే తమకే పోస్టులు ఇప్పించాలని టీడీపీ కార్యకర్తలు పోటీ పడుతున్నారు. దీంతో పార్టీలోని ద్వితీయ శ్రేణీ నాయకులు తలలు పట్టుకుంటున్నారు. మండలంలో మొత్తం ఎనిమిది పంచాయతీలు ఉన్నాయి. ఎం.అగ్రహారం, పెరవలి, బసినేపల్లి, ఎడవలి గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులకు ఐదుగురి నుంచి ఆరుగురి వరకు పోటీ పడుతున్నారు. పోటీ పడేవారంతా ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం పని చేసిన వారే. గత వైసీపీ ప్రభుత్వం లో ఫీల్డ్ అసిస్టెంట్‌లను తొలగించి వైసీపీ కార్యకర్తలను ఫీల్డ్ అసిస్టెంట్లుగా నియ మించుకున్నారు. పలు అవినీతి అక్రమాలు జరిగాయనీ ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. దీంతో ఫీల్డ్ అసిస్టెంట్ల ఎంపిక ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు తెలిసిం ది. మండలాల వారీగా సమావేశాలు నిర్వహిం చి నేతలందరి సమష్టి నిర్ణయం మేరకు పోస్టులను భర్తీ చేస్తామని ఆయన పార్టీ నేతలకు సూచించినట్లు తెలిపారు. పదవులు ఇప్పిస్తామని చెప్పి ఎవరైనానాయకులకు డబ్బు లు ఇస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాననీ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు హెచ్చరించినట్లు సమాచారం. దీంతో ఆ గ్రామాల పరిధిలోని నాయకులు పని చేసిన టీడీపీ కార్యకర్తలనే నియమించుకోవాలని ఏకాభిప్రాయం వచ్చినట్లు తెలిపారు.

ఆర్ఎంపీ ఇన్‌జక్షన్‌తో బాలుడు మృతి

నకిలీ వైద్యుడిపై డిప్యూటీ డీఎంహెచ్‌వో విచారణ



బాలుని అమ్మమ్మ బస్సమ్మను విచారిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో సత్యవతి

గోనెగండ్ల, జూలై 10: గోనెగండ్ల మండల పరిధిలోని గంజహళ్లి గ్రామంలో బడేసావలి అనే నకిలీ వైద్యుడు వేసిన ఇన్‌జెక్షన్ వికటించి ఆదే గ్రామానికి చెందిన 12 ఏళ్ల బాలుడు రాజేష్ మృతి చెందడంపై బుధవారం డిప్యూటీ డీఎంహెచ్‌వో సత్యవతి, స్థానిక వైద్యులు కార్తీక్ విచారణ చేపట్టారు. మూడు రోజుల క్రితం వైద్యం వికటించి బాలుడు మృతి చెందాడు. డిప్యూటీ డీఎంహెచ్‌వో సత్యవతి మృతి చెందిన బాలుని అమ్మమ్మ బోయ బస్సమ్మను విచారించి వాస్తవాలను తెలుసుకున్నారు. బాలుడు స్థానిక పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. 15 రోజుల క్రితం రాజేష్‌కు జ్వరం వచ్చింది. తల్లిదండ్రులు రాజేశ్వరి, నాగరాజు గ్రామంలో ఉన్న బడేసావలి అనే నకిలీ వైద్యుడిని ఆశ్రయించారు. అతడు చేసిన ఇన్‌జెక్షన్ మూడు రోజులకు వికటించింది. ఇన్‌జెక్షన్ వేసిన చోటి నుంచి చీము, రక్తం రావడంతో కర్నూలు ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ ఆరు రోజలపాటు రూ. 6.50 లక్షలు ఖర్చు చేసుకున్నా నయంగాక మృతి చెందాడని బస్సమ్మ బోరున విలపిస్తు విచారణలో తెలిపారు. అలాగే వైద్యం చేసిన బడేసావలిని కూడా అధికారులు విచారించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌వో సత్యవతి మాట్లాడుతూ ఆర్ఎంపీ, పీఎంపీలు ఇన్‌జెక్షన్ వేయరాదని అన్నారు. విచారణ జరిపి నివేదికను డీఎంహెచ్‌వోకు పంపుతామని ఆయన నిర్ణయం ప్రకారం చర్యలు ఉంటాయని అన్నారు.

ఖైదీల్లో సత్ప్రవర్తన కోసం కృషి చేయాలి: ఎంపీ



జైలును పరిశీలిస్తున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

కర్నూలు(లీగల్), జూలై 10: ఖైదీల్లో సత్ప్రవర్తన పెరిగేలా జైలు అధికారులు కృషి చేయాలని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు కోరారు. ఎంపీ హోదాలో ఆయ న మొదటిసారి జిల్లా జైలును బుధవారం సందర్శించారు. ఆయన వివిధ కేసుల్లో శిక్షలు పడిన ఖైదీలను కలిసి వారికి అందిస్తున్న భోజన, ఇతర సదుపాయాల గురిం చి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జైలు నిబంధనలకు అనుగుణంగా ఖైదీలకు అన్ని వసతి సౌకర్యాలు కల్పించాలని, వారిలో మార్పు తీసుకువచ్చేందుకు అవసరమైన వాతావరణాన్ని కల్పించాలని అధికారులను కోరారు.

క్రాప్ లోన్ మంజూరుకు బ్యాంకు అంగీకారం

కర్నూలు(లీగల్), జూలై 10: నిబంధనల మేరకు అన్ని షరతులు పూర్తి చేసిన రైతుకు క్రాప్ లోన్ మంజూరు చేయడానికి బ్యాంకు అంగీకరించినట్లు శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షుడు బి. లీలా వెంకట శేషాద్రి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కడప జిల్లాకు చెందిన రంగస్వామి అనే రైతు రుద్రవరం మండలంలో ఉన్న తన భూమి మీద క్రాప్ లోను తీసుకున్నాడు. 2012 నుంచి ఈ రైతు చాలాసార్లు క్రాప్ లోన్ తీసుకుంటూ తిరిగి చెల్లించేవాడు. అదే విధంగా గత ఏడాది కూడా దరఖాస్తు చేసుకున్నాడు. అన్ని నిబంధనలు పూర్తిచేసినా కెనరా బ్యాంకు రైతుకు రుణం మంజూరు చేయలేదు. దీంతో ఆయన న్యాయవాది పి శివసుదర్శన్ ద్వారా శాశ్వత లోక్‌అదాలత్‌ను ఆశ్రయించాడు. అదాలత్ కెనరా బ్యాంకుకు నోటీసు జారీ చేయడంతో బ్యాంకు అధికారులు బుధవారం హాజరై రైతుకు క్రాప్ లోన్ కింద రూ.90వేలు మంజూరు చేశారు.

ఓపీ కోసం తిప్పలు


ఓపీ కౌంటరు వద్ద రోగుల రద్దీ

కర్నూలు(హాస్పిటల్), జూలై 10: రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద ఆసుపత్రిగా పేరొందిన కర్నూలు జీజీహెచ్‌లో రోగులకు ఓపీ కోసం అవస్థలు తప్పడం లేదు. బుధవారం న్యూరో సర్జరీతోపాటు ఆర్థో, మెడిసిన్, ఈఎన్‌టీ, మానసిక సర్జరీ రోగులు అధికంగా వచ్చారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఓపీ కేంద్రాల వద్ద నరకం కనిపిస్తోంది. పేర్ల నమోదుకే గంటల తరబడి వేచి ఉండటం ఆ తర్వాత ఓపీ చీటిల కోసం క్యూలైన్లలో పడిగాపులు కాయాల్సి వస్తోంది. ఇటీవల ఆసుపత్రిలో ఓపీ కౌంటర్లను పదింటికి పెంచామంటున్న అధికారులు జాప్యం ఎక్కడ జరుగుతుందో తెలుసుకోలేకపోతున్నారు. మధ్యాహ్నం 12 గంటలైనా ఓపీ కేంద్రాల వద్ద రోగుల రద్దీ తగ్గలేదు. ఆసుపత్రి సూపరింటెండెంట్ సీఎస్ఆర్ఎంవో, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో, ఏఆర్ఎంవో ఇద్దరు హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ బుధవారం ఆసుపత్రిలో రౌండ్స్ నిర్వహించారు. ఓపీ దగ్గర రద్దీని గుర్తించారు. మరీ ఇకనైనా ఈ సమస్య పరిష్కారానికి ఓ ప్రత్యేక అధికారిని నియమించి రోగులకు సేవలు అందే విదంగా చర్యలు చేపట్టాలని ప్రజాసంఘాలు కోరుతున్నారు. ఎక్స్‌రే క్యాష్ కౌంటరు వద్ద కూడా ఇలాంటి రద్దీనే కనిపించింది.

రోగులకు నాణ్యమైన ఆహారం అందించాలి


సాంబారును పరిశీలిస్తున్న సూపరింటెండెంట్, అధికారులు

కర్నూలు(హాస్పిటల్), జూలై 10: రోగులకు నాణ్యమైన ఆహారం అందించాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ సి.ప్రభాకర్ రెడ్డి ఆదేశించారు. బుధవారం ఆయన ఆసుపత్రిలో రౌండ్స్ నిర్వహించారు. డైట్ విభాగాన్ని తనిఖీ చేశారు. రోగులకు అందించే సాంబరును పరిశీలించి ఇది రసామా లేదా సాంబారా అని సిబ్బందిని పరిశీలించారు. సాంబారులో పప్పు లేదని పలుచగా ఉందని అసహనం వ్యక్తం చేశారు. రోగులకు, డాక్టర్లకు ఎంత మందికి భోజనం ఇస్తున్నారని ఆరా తీశారు. ఆసుపత్రిలో పలు విభాగాల్లో ఎలక్ట్రికల్ లైట్లు, ఫ్యాన్ల మరమ్మతులు ఏమైనా ఉంటే తన దృష్టికి ఎందుకు తీసుకురావడం లేదని నర్సింగ్ సూపరింటెండెంట్‌పై అసహనం వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో జీవనాధార మెడికల్ షాపులను తనిఖీ చేశారు. ఏయే రకాలైనా మందులు అమ్ముతున్నారో ఆరా తీశారు. కార్యక్రమంలో సీఎస్ ఆర్ఎంవో వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో హేమనళిని, ఏఆర్ఎంవో వెంకట రమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్లు శివబాల, కిరణ్ కుమార్, ఏపీఎం ఎస్‌ఐడీసీ ఈఈ శివకుమార్ పాల్గొన్నారు.

పూర్తి స్థాయిలో పాఠ్యపుస్తకాలు అందించండి


డీఈవో కార్యాలయ ఏడీకి వినతి పత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 10: ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పూర్తి స్థాయిలో పాఠ్యపుస్తకాలు అందించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రంగప్ప, కార్యదర్శి అబ్దుల్లా డీఈవో కార్యాలయ ఏడీ శామ్యూల్‌పాల్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూర్తి స్థాయిలో పుస్తకాలు ఇవ్వకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. 7వ తరగతి విద్యార్థులకు ఇప్పటి వరకు ఒక పుస్తకం కూడా రాలేదని, పదో తరగతి విద్యార్థులకు ఫిజిక్స్, 6వ తరగతి విద్యార్థులకు సైన్స్, ఫిజిక్స్ సోషల్ టెక్స్‌బుక్‌లు రాలేదన్నారు.

వర్సిటీలో జరిగిన అవినీతిపై విచారణ చేపట్టాలి


మాట్లాడుతున్న మహేంద్రబాబు

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 10: క్లస్టర్ యూనివర్సిటీలో జరిగిన అవినీతిలో మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఎంత వాటా ఉందో రాష్ట్ర ప్రభుత్వం తేల్చాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేంద్రబాబు డిమాండ్ చేశారు. బుధవారం బుధవారపేట గోకారి భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా ఉంటూ యూనివర్సిటీ సొమ్మును దాదాపు రూ.5 కోట్లకు పైగా ఫోర్జరీ సంతకాలతో కాజేసినట్లు అధికారులే చెబుతున్నారని అన్నారు. అవినీతిని బయటపెట్టినందుకు మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి వీసీని బెదిరించడం తగదని, వీసికి రక్షణ కల్పించాలని కోరారు. యూనివర్సిటీలో ఫైల్స్ అన్నీ విచారణ జరిగే వరకు సీల్ చేసి భద్రపరచాలని కోరారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ బుగ్గన అవినీతిపై వెంటనే ఉన్నత స్థాయి కమిటీ వేయాలన్నారు. ఈ సమావేశంలో పీడీఎస్‌యూ నాయకులు ముస్తఫా, అశోక, నవీన్, మల్లి, రాకేష్ పాల్గొన్నారు.

పెద్దాసుపత్రికి వంద వీల్ చైర్లు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కర్నూలు(హాస్పిటల్), జూలై 10: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డీఆర్వోలు రోగుల కోసం వంద వీల్ చైర్లను కేటాయించినట్లు సూపరింటెండెంట్ సి.ప్రభాకర్ రెడ్డి తెలిపారు. అత్యవసర విభాగమైన క్యాజువాల్టీకి నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి ఆదేశాల మేరకు పది వీల్ చైర్లు కేటాయించినట్లు వెల్లడించారు. ఆసుపత్రిలో ఎవరైనా వీల్ చైర్లు అవసర మున్నా వార్డులు, ఇండెంట్ పెట్టాలని, ఆ తర్వాత ఆయా విభాగాలకు వాటిని అందజేయాలని నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రిబాయిని ఆదేశించారు.

కర్నూలు సిటీ కార్యవర్గం ఎన్నిక

కర్నూలు(హాస్పిటల్), జూలై 10: ఏపీ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీస్ అసోసియేషన్ (ఏపీ హంసా)కర్నూలు సిటీ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు అరవపాల్, జిల్లా అధ్యక్షుడు రఘుబాబు, నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. సిటీ అధ్యక్షుడిగా తెలుగు గోవిందు (కర్నూలు జీజీహెచ్), సెక్రటరీగా చక్రిదర్(కర్నూలు జీజీహెచ్), అసోసియేట్ ప్రెసిడెంటుగా మద్దూరు వెంకటస్వామి (ఈ.తాండ్రపాడు పీహెచ్‌సీ), జాయింట్ సెక్రటరీగా ఎం.లిల్లెమ్మ (స్టాఫ్ నర్సు, జీజీహెచ్), వైస్ ప్రెసిడెంట్లుగా ప్రసాద్, ప్రభాకర్ రెడ్డి, కోశాధికారిగా శివుడు (కార్డియాలజి టెక్నీషియన్, జీజీహెచ్) ఎన్నికయ్యారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

కల్లూరు, జూలై 10: గీతాంజలి నర్సింగ్ కళాశాల సహకారంతో ఉలింద కొండ గ్రామంలోని గర్భిణులకు పౌష్టికాహారం అందజేసినట్లు యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కళాశాల ప్రిన్సిపాల్ వసంతకుమారి ఆధ్వర్యంలో గర్భిణులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్లు రఘు, నవీణ్‌కుమార్, ఎస్.శ్రీధర్‌రెడ్డి హాజరయ్యారు. ఈమేరకు ఉలిం దకొండలో గర్భిణులను గుర్తించి మహిళలకు మెలుకువలు, మందులేలా ఉప యోగించాలో వివరించారు. అనంతరం గీతాంజలి యాజమాన్యం గర్భిణులు రక్త, షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్య క్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ నిర్మల, సురేఖ పాల్గొన్నారు.

జీవో 17ని రద్దు చేయాలి



మాట్లాడుతున్న మునెప్ప

కర్నూలు(న్యూసిటీ), జూలై 10: జీవో 17ని రద్దు చేసి భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఏఐటీయూసి జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన ఇసుక పాలసీ చూస్తే లబ్ధిదారులకు తక్కువ రేటుకు ఇసుక ఇస్తున్నట్లు ఉంది, ఉచితంగా లేదని అన్నారు. సమావేశంలో ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి డీసీ.రహిమాన్, ఏఐటీయూసీ నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్, డిప్యూటీ కార్యదర్శి రామాంజనేయులు, ఎం.రేణుక పాల్గొన్నారు.

హలో కేఎంసీకి స్పందన

కర్నూలు(న్యూసిటీ), జూలై 10: నగర పాలక సంస్థ వినూత్నంగా చేపట్టిన హలో కేఎంసీ కార్యక్రమానికి స్పందన లభిస్తున్నట్లు మేనేజర్ చిన్న రాముడు అన్నారు. బుధవారం ఆయన ఫిర్యాదుల విభాగాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుల విభాగంపై కమిషనర్ భార్గవతేజ ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. సోమవారం నుంచి సుమారు 180కి పైగా ఫిర్యాదులు వచ్చాయని, వాటిని రిజిస్టర్‌లో నమోదు చేసుకుని, సంబంధిత విభాగాలకు పంపుతామని పేర్కొన్నారు. హెల్ప్‌లైన్ ద్వారా వచ్చే ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని, ఇప్పటికే అన్ని విభాగాల అధికా రులకు కమిషనర్ ఆదేశించారని మేనేజర్ తెలిపారు. నగర పాలకకు సంబంధించి ఏవైనా ఫిర్యాదులు ఉంటే 7422992299కు కాల్ చేసి సమస్య తెలుపవచ్చన్నారు.

పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(న్యూసిటీ), జూలై 10: నగరంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్ కోరారు. బుధవారం నగరంలోని పలు పాఠశాలలను సీపీఎం బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు ఆడుకోవడానికి సరైన మైదానాలు లేవన్నారు. ఉన్న మైదానంలో అదనపు గదులతోపాటు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు కట్టడంతో మైదానం పూర్తిగా అంతరించిపోయిందన్నారు. జూనియర్ కళాశాలలో మొత్తం 29 మంది ఉపాధ్యాయులు అవసరమని అయితే ఇక్కడ 20 మంది మాత్రమే ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఎస్ఎండీ షరీఫ్, షేక్షావలి, నూర్‌బాషా పాల్గొన్నారు.

పండ్ల తోటల సాగుపై దృష్టి సారించాలి

సి.బెళగల్, జూలై 10: పండ్లతోటల సాగుపై రైతులు దృష్టి సారించాలని ఉపాధి కోర్సు డైరెక్టర్ సుజాతమ్మ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో ఉపాధి సిబ్బందితో ఆమె సమావేశమయ్యారు. ఏపీడీ అల్లిపీరా, ఏపీవో లక్ష్మన్న పాల్గొన్నారు.

రికార్డుల పరిశీలన: బురాన్‌దొడ్డి, బ్యాథోలి గ్రామాల మధ్య ఉన్న ఎల్లెల్సీ కాలువను కొందరు రైతులు ఆక్రమించుకుని సాగు చేసుకుంటు న్నారని స్థానిక రైతులు ఫిర్యాదు చేశారు. బుధవారం తహసీల్దార్ అనుపమ, ఎల్‌ఎల్సీ డీఈ సుబ్బరాయుడు, ఏఈ సూర్యప్రకాశ్‌లు కార్యాలయానికి వెళ్లి రెవెన్యూ రికార్డులను పరిశీలించారు.

10 లీటర్ల నాటుసారా, బైక్ స్వాధీనం

కోడుమూరు (రూరల్), జూలై 10: కోడుమూరు సెబ్ పోలీసుల దాడిలో 10 లీటర్ల నాటుసారా, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. సెబ్ సీఐ రామాంజనేయులు తెలిపిన వివరాలు.. మండలంలోని ఎల్ బండతాండలో వడిత్యా గోపాల్ నాయక్ అనే వ్యక్తి నుంచి 10 లీటర్ల నాటుసారా, బైక్‌ను స్వాధీనం కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్ తరలించినట్లు సీఐ తెలిపారు. సిబ్బంది హనుమంతు, వీరుపాక్షిరెడ్డి, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

15న నగర పాలక సంస్థ సర్వసభ్య సమావేశం

కర్నూలు(న్యూసిటీ), జూలై 10: నగర పాలక సంస్థ సర్వసభ్య సమావేశం ఈనెల 15న నిర్వహించనున్నట్లు కమిషనర్ భార్గవతేజ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మేయర్ బీవై రామయ్య అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి రాష్ట్ర మంత్రి టీజీ భరత్, ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, బొగ్గుల దస్తగిరి, ఎంపీ బస్తిపాటి నాగరాజు హాజరవుతారని పేర్కొన్నారు. సమావేశంలో 11 అజెండాలపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు కమిషనర్ వెల్లడించారు.

నేడు కల్లూరు మండల సర్వసభ్య సమావేశం

కల్లూరు, జూలై 10: కల్లూరు మండల సర్వసభ్య సమావేశం గురువారం ఉదయం 10.45 గంటలకు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అధికారులు అభివృద్ధి నివేదికలతో రావాలన్నారు. ఈసమావేశానికి ఎంపీటీసీ, కో-ఆప్టెడ్ మెంబర్లు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు హాజరుకావాలని కోరారు.

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

గూడూరు, జూలై 10: కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేసి ఆర్పీ, వీవోఏ, మున్సిపల్, ఆశా తదితర కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26వేలు ఇవ్వాలని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి జె.మోహన్ అన్నారు. బుధవారం గూడూరు పట్టణంలో కేంద్ర బీజేపీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సీఐటీయూ ఆలిండియా కమిటీ పిలుపు మేరకు కార్మికుల కోరికల దినోత్సవం సందర్భంగా గూడూరు తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.

అతిసారపై అవగాహన కల్పించండి

కర్నూలు(హాస్పిటల్), జూలై 10: వర్షాకాలంలో ప్రబలే అతిసారా వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంచాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై.ప్రవీణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. నగర శివారులోని టీవీ-9 కాలనీ, సచివాలయంలో జరుగుతున్న ఫ్యామిలి డాక్టర్ కార్యక్రమాన్ని డీఎంహెచ్‌వో తనిఖీ చేశారు. జూలై నెలంతా జరిగే స్టాప్ డయేరియా క్యాంపెయిన్‌లో భాగంగా సదస్సులు నిర్వహించాలన్నారు.

15న సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలు

కర్నూలు(స్పోర్ట్స్), జూలై 10: జిల్లా సాఫ్ట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీన స్థానిక ఔట్‌డోర్ స్టేడియంలో జిల్లా స్థాయి సీనియర్స్ బాలబాలికల ఎంపిక పోటలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సాఫ్ట్‌బాల్ సంఘం కార్యదర్శి కే.విజయకుమార్ తెలిపారు. ఎంపికైన వారు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. 15న ఉదయం 9 గంటలకు సాఫ్ట్‌బాల్ కార్యదర్శి విజయకుమార్ ఎదుట హాజరు కావాలని, వివరాలకు 703208808 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఇందిరమ్మ ఇళ్లలో సమస్యలు

పరిష్కరించాలని ఎమ్మెల్యే గౌరు చరితకు వినతి


ఎమ్మెల్యే గౌరు చరితను సన్మానిస్తున్న పందిపాడు గ్రామస్థులు

కల్లూరు, జూలై 10: పందిపాడులోని ఇందిరమ్మ ఇళ్లలోని ప్రజలు సమస్యలతో సతమతమౌతున్నారు. బుధవారం మాధవీనగర్‌లోని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితను కలిసి కాలనీ ప్రజలు సమస్యలతో కూడిన వినతిప త్రం అందజేశారు. 2009లో అక్కడ 2500 మందికి ఇళ్లు ఇచ్చారని నేటికి ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని ఎమ్మెల్యేకు వివరించారు. రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి వసతి, రాత్రివేళల్లో కరెంట్ లేక బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నామని కాలనీవాసులు తెలిపారు. సమస్యలను పరిష్కరిస్తామని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాము, నాగరాజు, గోకారి, అన్వర్, కాశమ్మ తదితరులు పాల్గొరన్నారు.

దొంగ బిల్లులు వసూలు చేసిన విద్యుత్ సిబ్బంది

- రెండేళ్లకు బయటపడ్డ వైనం
- ఉన్నతాధికారులకు రిపోర్టు చేస్తానన్న ఏఈ


కరెంటు బిల్లును చూపుతున్న పిండిమిషన్ యజమానులు

సి.బెళగల్, జూలై 10: మండలంలోని కబందహల్ గ్రామంలో విద్యుత్‌శాఖలో లైన్‌మెన్ విధులు నిర్వహించే శ్రీను, గిరి రెండేళ్లుగా ఓ పిండి మిషన్ యజమానులను కరెంట్ బిల్లుల విషయంలో చేసిన మోసం బుధవారం బయట పడింది. గ్రామానికి చెందిన కేశన్న, పక్కీరప్ప కలిసి పిండి మిషన్ నడుపుకుంటున్నారు. సాధారణంగా పిండి మిషన్ యూనిట్‌కు నెలకు రూ 3500 నుండి రూ. 5 వేల లోపు బిల్లు వచ్చే అవకాశం ఉంది. అయితే ఈ ఇద్దరు విద్యుత్ శాఖ సిబ్బంది రెండు సంవత్సరాల నుండి నెలకు రూ 10,000 నుండి 15,000 వేల దాకా వసూలు చేసుకుని బిల్లు ఇవ్వకుండ కాలం గడుపుతున్నారు. విద్యుత్ శాఖ మీది నమ్మకంతో సిబ్బంది అడిగిన డబ్బు ఇచ్చేవాళ్లమని పిండి మిషన్ యజమానులు చెబుతున్నారు. అయితే జూలై నెల విద్యుత్ బిల్లు ఏకంగా రూ. 41,819 బిల్లు పిండి మిషన్ యజమానుల ఇంట్లో ఇచ్చి వెళ్లారు. వారు దాన్ని తీసుకొని సోమవారం ప్రజా ఫిర్యాదుల సేకరణ కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. అక్కడి నుంచి సి బెళగల్ విద్యుత్ శాఖ ఏఈ సుకుమార్‌కు సమాచారం వెళ్లింది. ఆయన రికార్డులలో నమోదు అయిన వాస్తవ బిల్లును పిండి మిషన్ యజమానులకు అందజేశారు. ఇది గమనించిన లైన్‌మెన్లు.. ప్రజా ఫిర్యాదుల అర్జీపై తాము పిండిమిషన్ యాజమాన్యం రాజీ అయినట్లు సదరు యజమాని సంతకంతో విద్యుత్ ఏఈకి ఉత్తరం తెచ్చి ఇచ్చారు. ఈ విషయం ఏఈ పిండి మిషన్ యజమానులకు చెప్పడంతో అసలు విషయం బయటపడింది. దీంతో పిండిమిషన్ యజమానులు విలేకర్లతో మాట్లాడుతూ లైన్‌మెన్లపై చర్యలు తీసుకొని, తమకు న్యాయం చేయాలని కోరారు. ఆ ఇద్దరు సిబ్బందిపై విచారణ చేసి జిల్లా ఉన్నతాధికారులకు రిపోర్టు పంపుతానని ఏఈ సుకుమార్ వివరణ ఇచ్చారు.

లోకేశ్‌ను కలిసిన నాయకులు


లోకేశ్‌ను కలిసిన మహబూబ్ బాషా, నాగేశ్వరరావు యాదవ్

ఓర్వకల్లు, జూలై 10: మండలంలోని హుశేనాపురం గ్రామానికి చెందిన ముస్లిం మైనార్టీ నాయకుడు మహబూబ్ బాషా బుధవారం మంగళగిరిలో రాష్ట్ర విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌ను కలిశారు. మంగళగిరిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసినట్లు మహబూబ్ బాషా తెలిపారు. పాణ్యం నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఓర్వకల్లు మండలాన్ని ఇండస్ట్రీయల్ హబ్‌గా తీర్చిదిద్దాలని లోకేశ్‌ను కోరినట్లు ఆయన తెలిపారు. అన్వర్, షాషావలి, పాల్గొన్నారు.

కర్నూలు(అర్బన్): యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీలన్ని నెరవేర్చుతూ రాష్ట్రాభివృద్ధికి మంత్రి నారా లోకేష్ తపన పడుతున్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై. నాగేశ్వరరావు యాదవ్ అన్నారు. బుధవారం మంగళగిరిలో లోకేష్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మంగళగిరిలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌కు స్పందన లభిస్తోందన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయండి: పీడీ


ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న పీడీ సిద్ధలింగమూర్తి

కోడుమూరు (రూరల్), జూలై 10: ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసుకోవాలని హౌసింగ్ పీడీ సిద్ధలింగమూర్తి తెలిపారు. బుధవారం ప్యాలకుర్తి లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను పీడీ పరిశీలించి అధికారులనడిగి పురోగతిని తెలుసుకున్నారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడుతూ స్టేజీ వారీగా బిల్లులు అందుతాయని తెలిపారు. వందరోజుల కార్యాచరణతో పనులు పూర్తి చేయడానికి సంసిద్ధం కావాలని కోరారు. ఉపాధి నిధులు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఈ వాసుదేవరావు, వర్క్ఇన్స్‌పెక్టర్ అఫ్రోజ్ పాల్గొన్నారు.

డ్రగ్స్, గంజాయిని అరికట్టాలి

కర్నూలు(కలెక్టరేట్), జూలై 10: డ్రగ్స్, గంజాయిని అరికట్టాలని ఏఐవైఎఫ్ డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి భీసన్న, జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసులు మాట్లాడుతూ కొంత మంది రాజకీయ నాయకుల అండదండలతో రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయి విచ్చలవిడిగా రవాణా చేస్తూ యువతను మత్తుకు బానిసలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజీవ్, సహాయ కార్యదర్శి శ్రీరాములు పాల్గొన్నారు.

ముగిసిన టీచ్ టూల్ శిక్షణ

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 10: స్థానిక పెద్దపాడు ఆదర్శ పాఠశాలలో గత తొమ్మిది రోజుల నుంచి నిర్వహిస్తున్న టీచ్ టూల్ శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా ఏఎంవో షేక్ రఫీ మాట్లాడుతూ జిల్లాలో నాలుగు కేంద్రాల్లో 474 మందికి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం మాస్టర్ ట్రైనర్లను ఉపాధ్యాయులు సత్కరించారు.

గ్రామాల్లో మొక్కలు నాటాలి: డీపీవో

కర్నూలు(కలెక్టరేట్), జూలై 10: గ్రామాల్లో మొక్కలు నాటాలని జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు నాయుడు తెలిపారు. బుధవారం నన్నూరులోని రాగమయూరి కాలనీలో వంద మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా నాగరాజు నాయుడు మాట్లాడుతూ గ్రామాల్లో కనీసం 200 మొక్కలు నాటాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు.

ఇంటర్ ప్రవేశాలకు ఆహ్వానం

కోడుమూరు(రూరల్), జూలై 10: కోడుమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రవేశాలకు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ ఇంటర్‌లో అన్ని గ్రూపులకు సీట్లు ఉన్నాయని, బాలబాలికలకు ఉచిత హాస్టల్ వసతి సౌకర్యం ఉన్నట్లు చెప్పారు. ఈ ఏడాది నుంచి ప్రభుత్వమే ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, బ్యాగులు అందిస్తుందని అన్నారు.

చావిళ్లలో కొలువు దీరిన పీర్లు

ఓర్వకల్లు, జూలై 10: మండలంలోని ఓర్వకల్లు, కన్న మడకల, పూడిచెర్ల, లొద్దిపల్లె, నన్నూరు, ఉయ్యాలవాడ, శకునాల, కాల్వ, తదితర గ్రామాల్లో మొహర్రం సందర్భంగా బుధవారం చావిళ్లలో పీర్లు కొలువుదీరాయి. పీర్లకు పూజలు చేసి ప్రతిష్ఠించారు.

ఉచిత ఇసుకతో కార్మికుల జీవితాల్లో వెలుగు

గూడూరు, జూలై 10: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రవేశ పెట్టిన ఉచిత ఇసుక విధానంతో భవన నిర్మాణ కార్మికుల్లో వెలుగులు నిండిందని నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ కురుకుంద రామాంజనేయులు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గజేంద్ర గోపాల్ నాయుడు అన్నారు. బుధవారం గూడూరు భారత తాపీ మేస్త్రీ సంఘం ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు నాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకాలు చేసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కర్నూలుకు తరలివెళ్లి జిల్లా టీడీపీ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డికి కలిసి చంద్రబాబు చిత్రపటాన్ని అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భారత తాపీ మేస్త్రీ సంఘం గౌరవాధ్యక్షుడు గౌండా కుమార్, సంఘం ప్రెసిడెంటు పైగేరి మధువర్ధన్ రాజు, వైస్ ప్రెసిడెంటు రమేష్, ట్రెజరర్ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

ఐసీడీఎస్‌ను బలోపేతం చేయాలి

కర్నూలు(న్యూసిటీ), జూలై 10: ఐసీడీఎస్‌కే కేంద్ర ప్రభుత్వం ఎక్కువ నిధులు కేటాయించి మరింత బలోపేతం చేయాలని శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ పి.నిర్మల డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట అంగన్ వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు రేణుకమ్మ అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మల మాట్లాడుతూ అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.26 వేలు, పీఎఫ్, ఈఎస్ఐ పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఐసీడీఎస్ ప్రైవేటీకరణ, ప్రభుత్వం రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలన్నారు. అనంతరం ఐసీడీఎస్ పీడీ వెంకటలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. కార్యక్ర మంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్.రాధాక్రిష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు, బాలదుర్గమ్మ, రమాదేవి, విజయలక్ష్మి, పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కల్పించాలి

ఓర్వకల్లు, జూలై 10: మహిళలకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని అంతర్జాతీయ మానవ హక్కుల కమిషన్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు హనీసా ఫాషా అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం ముచ్చుమర్రి గ్రామానికి చెందిన బాలిక వాసంతి జీవితం విషాదంగా మారడం కలిచివేసిందన్నారు. బాలికపై జరిగిన దారుణం సమాజంలోని అందరూ సిగ్గుతో తలదించుకో వాలన్నారు. ఆడుకుంటున్న ఆ చిన్నారిని అపహరించి దురాఘతానికి పాల్ప డిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం స్పందించి మహిళలు, బాలికలపై జరిగే అరాచకాలు, హత్యలు వాటిపై కఠిన శిక్షలు ప్రవేశ పెట్టాల న్నారు.

కోడుమూరు ఎమ్మెల్యేను కలిసిన క్రెడాయ్ సంస్థ సభ్యులు

కర్నూలు(రూరల్), జూలై 10: కోడుమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరిని కర్నూలు నగరానికి చెందిన క్రెడాయ్ సంస్థ సభ్యులు నందనపల్లెకు చెందిన పినాకపాణి గౌడ్ ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛం అందించి మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతోపాటు టీడీపీ సీనియర్ నాయకుడు ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డిని ఆయన నివాసంలో క్రెడాయ్ సభ్యులు కలిసి శాలువ కప్పి సత్కరించారు. కార్యక్రమంలో క్రెడాయ్ సంస్థ నాయకులు సోమిశెట్టి వెంకట్రామయ్య, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, బిల్డర్లు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలి

కర్నూలు(అర్బన్), జూలై 10: కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు లాజరస్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కో-ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ అనంత రత్నం మాదిగతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 నుంచి 59 సంవత్సరాలు మధ్య ఉన్న ప్రతి మహిళ అకౌంట్‌లో ప్రతి నెల రూ.1500, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ప్రతి ఇంటికి మూడు గ్యాస్ సిలిండర్లు, ముస్లింలకు దుల్హన్ పథకం అమలు చేయాల న్నారు. సమావేశంలో నాయకులు షేక్ ఖాజాహుసేన్, అబ్దుల్, బి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

చెన్నంచెట్టి పల్లెలో వెలుగులు


కరెంటు స్తంభాలు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

ఓర్వకల్లు, జూలై 10: మండలంలోని సోమయాజులపల్లె మజరా గ్రామమైన చెన్నంచెట్టి పల్లె సుంకులమ్మ ఆలయం సమీపంలో విద్యుత్ లేక 70 కుటుంబాలు అంధకారంలో ఉండేవి. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితమ్మ, నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ ఆధ్వర్యంలో గ్రామ నాయకులు వెంకటసుబ్బయ్య, శివ, పుల్లారెడ్డి, తిమ్మారెడ్డి, గోకుల వెంకటేశ్వర్లు, నరసింహులు, బోయ సిద్దయ్య, వడ్డె రామాంజనేయులు, సహదేవుడు ఆధ్వర్యంలో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి ఆ కాలనీకి విద్యుత్ వెలుగులు అందించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఎమ్మెల్యే గౌరు చరిత, రాజశేఖర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

వైసీపీ నాయకుడిపై చర్యలు తీసుకోవాలి

● డిప్యూటీ డీఈవోకు టీడీపీ నాయకుల ఫిర్యాదు



ఇటుకలను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

కోసిగి, జూలై 10: సాతనూరు పాఠశాల ఇటుకలను వాడుకున్న వైసీపీ నాయకుడు మర్రిస్వామిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు ముత్తురెడ్డి, మాజీ సాగునీటి సంఘం అధ్యక్షులు పల్లెపాడు రామిరెడ్డి అన్నారు. ఇదే అంశంపై ఈ నెల 9న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి స్పందించిన డిప్యూటీ డీఈవో వెంకటరమణారెడ్డి బుధవారం విచారణ చేపట్టారు. ఈ మేరకు వైసీపీ నాయకుడు మర్రిస్వామిపై టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి సహకారంతోనే ఇదంతా జరిగిందని, ఆమెపై కూడా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ జ్ఞానేష్, మాజీ జడ్పీటీసీ తోవి రామక్రిష్ణ, నాగేంద్ర, వెంకటేశ్, రఘు, మధు, మహదేవ, దేవన్న, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరికి రూ.80 వేల జరిమానా

ఎమ్మిగనూరు, జూలై 10: మంత్రాలయం మండల పరిధిలోని మద్యం అక్రమ రవాణా కేసుల్లో నిందితులు, బైండోవర్ అయిన ఈడిగ జయరాముడు, చెట్నేపల్లి ఉరుకుందులకు మంత్రాలయం తహసీల్దార్ శ్రీధర్‌రావు రూ.80వేల జరిమానా విధించారు. ఈడిగ జయరాముడు, నారాయణపురం గ్రామానికి చెందిన చెట్నేపల్లి ఉరుకుందులు పలుమార్లు మద్యం రావాణా చేస్తూ పట్టుబడిన కేసుల్లో నిందితులుగా ఉన్నారు. వారిని అరెస్టు చేసి తహసీల్దార్ ముందు హాజరు పరచడంతో జరిమానా విధించారన్నారు. సెబ్ సీఐ భార్గవరెడ్డి తెలిపారు.

పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

పత్తికొండ, జూలై 10: నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న పలు ప్రైవేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకుడు కరణం నరేష్, ఏబీవీపీ నాయకుడు సోమన్నలు డీఈవో శ్యామ్యూల్ కు బుధవారం వినతి పత్రం అందించారు. యశోదా గార్డెన్ పాఠశాలను లీజ్‌కు తీసుకుని నిర్వహిస్తున్న పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజుల వసూలు చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు బాలికపట్ల అసభ్యంగా ప్రవర్తించినా యాజమాన్యం చర్యలు చేపట్టకుండా ఆ బాలికనే పాఠశాల నుంచి పంపించి వేసిందన్నారు. అప్పట్లో పాఠశాల చర్యలు చేపట్టకపోవడంతో ఆ ఉపాధ్యాయుడు వేరే పాఠశాలలో చదువుతున్న బాలికను తీసుకుని వెళ్లిపోయాడని తెలిపారు. స్పందించిన డీఈవో సంబంధింత పాఠశాలపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఎంఈవో రమేష్‌కు ఆదేశాలు జారీ చేశారు.

ఉపాధి కూలీల డబ్బులు ఇవ్వాలి

మంత్రాలయం, జూలై 10: ఉపాధి పనులకు ఇవ్వాల్సిన ఎనిమిది వారాల కూలీల డబ్బులు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. బుధవారం పరమాన్‌దొడ్డి తండా రోడ్డుపై సీపీఐ జెండాలు పట్టుకుని ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి లక్ష్మణ్ నాయక్ మాట్లాడుతూ మంత్రాలయం నియోజకవర్గంలో ఉపాధి పనుల కింద పని చేసిన కూలీలకు ఎనిమిది వారాలుగా డబ్బులు బ్యాంకులో జమ కాలేదని అన్నారు. బకాయిలు వెంటనే చెల్లించి రోజుకు రూ.600 కూలీలు వచ్చేట ట్లు చెల్లించాలని కోరారు. ఈ ధర్నాలో సీపీఐ నాయకులు వీరేష్ నాయక్, గాబ్రియేలు, ఈరన్న నాయక్, ఓంకార్ నాయక్, హనుమంతనాయక్‌లు పాల్గొన్నారు.

ఆలూరు అభివృద్ధికి సహకరించాలి

● కలెక్టర్‌ను కోరిన ఎమ్మెల్యే విరుపాక్షి



కలెక్టర్‌కు బొకే ఇస్తున్న విరుపాక్షి

ఆలూరు, జూలై 10: వెనుకబడిన ఆలూరు నియోజకవర్గ అభివృద్ధికి సహకారం అందించాలని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి కలెక్టర్ రంజిత్ బాషాను బుధవారం కోరారు. నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం నిధులు కేటాయించాలని అన్నారు. రహదారులు అధ్వానంగా ఉన్నాయని, వాటిని బాగు చేయించేందుకు అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని అన్నారు. ఏళ్ల తరబడి ఆలూరులో సంత మార్కెట్లో, ఎంపీడీవో కార్యాలయం వద్ద నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌లను ప్రారంభించాలని కోరినట్లు ఆయన తెలిపారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో కోరికల దినోత్సవం

ఎమ్మిగనూరు రూరల్, జూలై 10: సీఐటీయూ జాతీయ కమిటీ పిలుపు మేరకు బుధవారం ఎమ్మిగనూరులో సీఐటీయూ నాయకులు గోవిందు, రాముడుల ఆధ్వర్యంలో కార్మికుల కోరికల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, మున్సిపల్ వర్కర్స్, స్వచ్ఛభారత్, సర్వశిక్షా అభియాన్‌లతోపాటు కార్మికులు ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు రామాంజనేయులు, గోవిందు, రాముడు, గోవర్ధనమ్మ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనీస వేతన చట్టం జీవోను అమలు చేసి రూ.26వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాగలక్ష్మి, శైలజ, శివలక్ష్మి, కేశన్న, సిద్దరామప్ప, స్వామి పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించాలి

ఎమ్మిగనూరు టౌన్, జూలై 10 : ఎమ్మిగనూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అవరణంలో విద్యార్థి సమస్యలపై పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి ఎం. రవి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెట్టిన నూతన విద్యా విధానం విద్యార్థులను మానసికంగా కుంగబాటుకు గురి చేస్తుందని అన్నారు. విద్యా సంస్థలు ప్రారంభమై రెండు నెలలైనా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇవ్వలేదని అన్నారు. ప్రభుత్వం వేంటనే స్పందించి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం పీడీఎస్‌యూ అధ్యక్షుడిగా మనోహర్, కార్యదర్శిగా వీరేంద్రను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రంగస్వామి, నాగరాజు, ప్రవీణ్ పాల్గొన్నారు.

కన్నడ మీడియం పుస్తకాల పంపిణీ

కౌతాళం, జూలై 10: మండలంలో కన్నడ చదువుతున్న విద్యార్థులకు కర్ణాటక రాష్ట్రం సిరుగుప్ప ఎమ్మెల్యే నాగరాజు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కన్నడ ఉపాధ్యాయుడు హనుమంతప్ప మాట్లాడుతూ కౌతాళం మండలంలో కన్నడ మీడియం చదువుతున్న 7726 మంది విద్యార్థులకు ఉచితంగా దాదాపు రూ.22 లక్షల విలువ చేసే పాఠ్యపుస్తకాలను సరఫరా చేశారని అన్నారు. ఈ పుస్తకాలను సిరుగుప్ప ఎమ్మెల్యే నాగరాజు కర్ణాటక క్షేత్ర శిక్షణ అధికారి అందజేశారని తెలిపారు.

ఎమ్మెల్యే పార్థసారథికి సన్మానం

ఆదోని టౌన్, జూలై 10: ఎమ్మెల్యే డా. పార్థసారథి బుధవారం రాత్రి విక్టోరియా పేటలో ఉన్న రుక్మిణి పాండురంగ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భావసార క్షత్రియ సంఘం పెద్దలు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం పెద్దలు మహేంద్రకర్, లక్ష్మణ్ రావు, బాబురావు, మహేంద్రకర్, అనిల్ కుమార్, బీజేపీ నాయకులు నాగరాజు గౌడ్, ఉపేంద్రకుమార్ పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి



ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు

ఆదోని (అగ్రికల్చర్), జూలై 10: అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈరన్న డిమాండ్ చేశారు. బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ఆల్ ఇండియా కార్మికుల దినోత్సవాన్ని పురస్కరించుకొని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగసంస్థలను కార్పొరేట్ సంస్థలకు అప్పనంగా విక్రయిస్తోందని అన్నారు. ఎల్ఐసీ, బీఎస్ఎన్ఎల్, పోస్టల్, డిఫెన్స్, రైల్వే ప్రభుత్వ రంగ సంస్థలన్నింటిని ప్రైవేటీకరణ చేయడం దుర్మార్గం అన్నారు. అంగన్‌వాడీలకు, ఆశావర్కర్లకు సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు గ్రాట్యూటీ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో వరలక్ష్మి, రిజ్వానా, సరోజ, గీతమ్మ, సోమక్క, తిక్కప్ప పాల్గొన్నారు.

హొళగుంద: అంగన్‌వాడీ, ఆశా వర్కర్ల డిమాండ్లను నెరవేర్చాలని సీఐటీయూ నాయకులు నాగరాజు, వెంకటేష్ అన్నారు. తహసీల్దార్ కార్యాలయం ముందు బుధవారం నిరసన తెలిపారు. అనంతరం ఆర్ఐ దినేజ్‌కుమార్‌కు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకుడు మల్లికార్జున పాల్గొన్నారు.

ఆలూరు, జూలై 10: అంగన్వాడీ వర్కర్స్ సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ చంద్రశేఖర్‌కు వినతి పత్రం అందించారు. సీఐటీయూ నాయకులు నారాయణస్వామి మాట్లా డుతూ లేబర్ కోడ్‌ను రద్దు చేయాలని అన్నారు. కనీస వేతనం, పెన్షన్ కల్పించాలని కోరారు.

మంత్రాలయం: అంగన్వాడీ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు విశాలాక్షి, లావణ్య, నాగవేణిలు అన్నారు. బుధవారం కోరికలు దినోత్సవంలో భాగంగా మంత్రాలయం తాహసీల్దారు కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి శ్రీధర్‌మూర్తికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు అనిత, నరసమ్మ, మాధురి, మీనాక్షి పాల్గొన్నారు.

దేవనకొండ: కార్మికుల హక్కులను కాలరాసే లేబర్ కోడ్‌ల ను రద్దు చేసి సమగ్ర చట్టం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వీరశేఖర్, మండల కార్యదర్శి అశోక్ అన్నారు. సీఐటీయూ కార్యాలయం నుంచి ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. సరోజమ్మ, మహబుబ్‌బాషా, లక్ష్మిరెడ్డి, రవీంద్ర, సుంకన్న పాల్గొన్నారు.

ఆస్పరి: ఏపీలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్‌ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ మండల గౌరవ అధ్యక్షుడు బాలకృష్ణ, మండల కార్యదర్శి రామాంజనేయులు కోరారు. బుధవారం స్థానిక మార్కెట్ నుంచి ర్యాలీగా బయలుదేరి తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఈరమ్మ, నాగరాజు, లత, అంజనమ్మ, రాధ పాల్గొన్నారు.

క్రిష్ణగిరి: కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనం చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగేశ్వరావు అన్నారు. తహసీల్దార్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ రామాంజనేయులుకు వినతిపత్రం ఇచ్చారు.

తుగ్గలి: అన్ని శాఖల్లో పని చేస్తున్న కార్మికులను ప్రభుత్వ కార్మికులుగా గుర్తించి అన్ని సదుపాయాలు కల్పించాలని సీపీఎం మండల అధ్యక్షులు శ్రీరాములు, రంగరాజు కోరారు. బుధవారం తహసీల్దార్ షర్మిలకు వినతి పత్రం అందజేశారు.

ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న యుటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సవీన్ పాటి

ఆదోని (అగ్రికల్చర్), జూలై 10: అపరి ష్కృతంగా ఉన్న ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ పాటి అన్నారు. బుధవారం యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్‌గ్రేడ్ ఉన్నత పాఠశాలలకు ఉపాధ్యాయ పోస్టులను మంజూరు చేయాలని కోరారు. మున్సిపల్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల పీఎఫ్ సమస్యను పరిష్కరించి బదిలీలు, పదోన్నతులు కల్పించాలన్నారు. జీవో నెంబర్ 117ను తక్షణమే రద్దు చేసి విద్యార్థుల సంఖ్యకు అను గుణంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని న్నారు. జీవిత, గాదిలింగ, శ్రీనివాసులు, మల్లికార్జున, కృష్ణమూర్తి, బసప్ప, నర్సయ్య గౌడ్, నల్లారెడ్డి, రంగనాథ, సుధాకర్ నాయక్ పాల్గొన్నారు.

పని సర్దుబాటు చేయాలి

ఉపాధ్యాయుల సీనియారిటీని పరిగణలోకి తీసుకొని ఆయా పాఠశాలల్లో వర్క్ అడ్జస్మెంట్ చేయాలని ఎస్టీయూ జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి సుంకన్న జిల్లా కార్యదర్శి గోపాల్ కోరారు. బుధవారం ఎంఈవోను కలిసి ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఈరన్న గౌడ్, కోటేశ్వరయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

సొసైటీ ఛైర్మన్ పదవి ఎవరికో..?



కిష్టన్న, రంగయ్య

మద్దికెర, జూలై 9: ఎన్డీయే కూటమి అధికారంలోకి రావడంతో నామినేటెడ్ పదవులపై తెలుగు తమ్ముళ్ల దృష్టి సారించారు. మండల కేంద్రమైన మద్దికెర సహకార సంఘం ఛైర్మన్ పదవిపై నేతల మధ్య పోటీ నెలకొంది. మద్దికెర సహకార సంఘం పరిధిలో మద్దికెర, ఎం.అగ్రహారం, పెరవలితోపాటు మరో ఏడు గ్రామాలు సహకార సంఘం పరిధిలోకి వస్తాయి. సహకార సంఘం రైతుల రుణాలు డిపాజిట్లు, బంగారు రుణాలు, వ్యాపార రుణాలు అన్ని కలిపి దాదాపు రూ.20 కోట్ల మేర లావాదేవీలు ఉన్నాయి. సహకార సంఘంలో దాదాపు పది వేల మందికి పైగా రైతులు సభ్యత్వాలు కలిగి ఉన్నారు. ఈ సహకార సంఘం ఛైర్మన్‌పై పలువురు ఆశలు పెట్టుకున్నారు. మద్దికెరకు చెందిన మాజీ మండల టీడీపీ అధ్యక్షుడు బీసీ సామాజిక వర్గానికి చెందిన ఉప్పర రంగయ్య, అలాగే నగిరి కిష్టన్న యాదవ్, ఛైర్మన్ పదవిపై ఆశలు పెంచుకున్నారు. సహకార సంఘం ఛైర్మన్ పదవి కోసం ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు దృష్టికి కూడా తీసుకెళ్లారు. సహకార సంఘం ఛైర్మన్ పదవి ఇంత వరకు ఉప్పర సామాజిక వర్గానికి చెందిన వారికి ఎవరికి కూడా ఇవ్వలేదని, ఈ దఫా తమకు ఒక అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. ఉప్పర రంగయ్య తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం పని చేస్తున్నారు. ఎస్వీ సుబ్బారెడ్డి, కేఈ ప్రభాకర్, కేఈ కృష్ణమూర్తి, కేఈ శ్యాంబాబుల విజయం కోసం పని చేశారని, పార్టీ నుంచి తనకు ఇంత వరకు ఎటువంటి నామినేటెడ్ పదవులు రాలేదని, నేతల దృష్టికి తీసుకెళ్తుండగా.. నగిరి కిష్టన్న కూడా పార్టీ కోసం మేము కష్టపడ్డామని, ఈ పదవిని తమకు ఇవ్వాలని అధిష్టానాన్ని కోరుతున్నారు. అలాగే ఎం.అగ్రహారం గ్రామానికి చెందిన ఒకరు కూడా ఈ పదవిపై దృష్టి సారించినట్లు పలువురు చర్చించుకుంటున్నారు. గతంలో సహకార సంఘానికి ఎన్నికలు జరిగేవని, జగన్ ప్రభుత్వంలో ఆ ఎన్నికలు జరగకుండా నామినేటెడ్ పోస్టులు ఇస్తూ వచ్చారు. దీంతో ఆ పదవిపై ఆశావాహులు ఆశలు పెంచుకున్నారు. ఎవరికి వరిస్తుందో ఈ పదవి వేచి చూడాల్సిందే.

కేబుల్ గుంతలోకి ఒరిగిన లారీ

తుగ్గలి, జూలై 10: గ్రానైట్ బండ్ల లోడుతో వెళ్తున్న లారీ ఎదురుగా వస్తున్న వాహనానికి సైడు ఇవ్వడానికి రోడ్డు దిగడంతో కేబుల్ గుంతలోకి ఒరిగింది. డ్రైవర్, క్లీనర్‌కు తృటిలో తప్పిన ప్రమాదం. బుధవారం మండల పరిధిలోని గిరిగెట్ల గ్రామం వద్ద రోడ్డు పక్కన కేబుల్ వైర్ల కోసం తవ్విన గుంతలను సక్రమంగా పూడ్చక పోవడంతో ఆ గుంతలో లారీ పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్‌లకు ఎటువంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

జీవోపై పునరాలోచన చేయాలి

ఆదోని టౌన్, జూలై 10: జీవో నెంబర్ 117పై ప్రభుత్వం పునరాలోచించాలని మైనారిటీ హక్కుల పరిరక్షణ కమిటీ రాష్ట్ర కార్యదర్శి నూర్ అహమ్మద్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ అనాలోచితంగా ప్రవేశ పెట్టిన ఈ జీవో కారణంగా అనేక పాఠశాలలు మూసివేతకు గురయ్యాయని తెలిపారు. చిన్నారులతోపాటు, వారి తల్లిదండ్రులు అనేక ఇబ్బందులకు ఎదుర్కోవాల్సి వచ్చిందన్నారు. ఫలితంగా చాలా మంది చదువుకు దూరం కావాల్సిన పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. అక్షరాస్యతను పెంచే చర్యలలో భాగంగా చంద్రబాబు ప్రభుత్వం ఈ జీవోపై చర్చించి, రద్దు చేయాలని కోరారు.

కౌలు రైతులను గుర్తించండి

హాలహర్వి, జూలై 10: గ్రామాల్లో రెవెన్యూ అధికారుల సహకారంతో కౌలు రైతులను గుర్తించాలని ఏవో శివశంకర్ అన్నారు. బుధవారం ఆర్బీకే కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వీఆర్వో, వీఏవోలు కలిసి కౌలు రైతుల జాబితా సిద్ధం చేయాలని, వారికి వెంటనే గుర్తింపు కార్డులు అందజేసి రుణాలు అందిస్తామని తెలిపారు. గ్రామ సర్పంచ్ మల్లికార్జున, కిశోర్ పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కౌతాళం, జూలై 10: పేకాట స్థావరంపై బుధవారం కౌతాళం పోలీసులు దాడులు చేసి పేకాట రాయుళ్లను అరెస్టు చేశారు. రూ.19వేల నగదుతోపాటు 6 ద్విచక్రవాహనాలు, 8 సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. మండల పరిధిలోని కామవరం-పెద్దతుంబళం మధ్య ఉన్న ఫారెస్ట్ భూముల్లో పేకాట ఆడుతున్నారని సమాచారం దాడి చేసి పేకాట ఆడుతున్న కుప్పగల్ గ్రామానికి చెందిన మల్లికార్జున, తిమ్మారెడ్డి, తలారి తిరుమలతో పాటు పెద్దతుంబళం గ్రామానికి చెందిన కాసీమయ్య, మక్బుల్‌బాషా, అబ్దుల్లాలను పట్టుకున్నామని ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డి తెలిపారు. పారిపోయిన మరో పది మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఐదుగురిపై కేసు నమోదు

మంత్రాలయం, జూలై 10: మంత్రాలయం పట్టణంలోని రామచంద్ర నగర్‌కు చెందిన అన్నదమ్ముల ఆస్తి గొడవల కారణంగా ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు మంత్రాలయం ఎస్ఐ గోపినాథ్ తెలిపారు. ఇంటి పంపకాల్లో మహిళలు ఒకరిపై ఒకరు ఘర్షణ పడటం దాడులకు దారి తీసిందని ఇరువురు ఫిర్యాదు చేయడంతో వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

కోసిగి, జూలై 10: పదో తరగతి పరీక్షలో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు ప్రణాళికలు రూపొందించుకుని విద్యార్థులను తీర్చిదిద్దాలని డిప్యూటీ డీఈవో వెంకట రమణారెడ్డి అన్నారు. బుధవారం సాతనూరు గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సబ్జెక్టుల పరంగా విద్యార్థులకు వచ్చే సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేయాలని సంబంధిత సబ్జెక్టుల ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం విద్యార్థులను పాఠ్యాంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు ఉన్నారు.

మొక్కలు నాటి కాపాడాలి

ఎమ్మిగనూరు, జూలై 10: ప్రతి ఒక్కరూ తమ పరిసరాల్లో మొక్కలు పెంచి పర్యావరణాన్ని కాపాడాలని అగ్నిమాపక అధికారి రామాంజనేయులు అన్నారు. బుధవారం కలుగొట్ల రోడ్డులో ఉన్న పద్మావతి ఫిల్లింగ్ స్టేషన్ ఆవరణంలో మున్సిపల్ 1వ వార్డు కౌన్సిలర్ కామార్తి నాగేషప్పతో కలిసి మొక్కలు నాటారు..

అధికారుల సూచనలు పాటించాలి

గోనెగండ్ల, జూలై 10: రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించాలని ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, ఏవో హేమలత అన్నారు. పంట బెట్ట నుంచి కోలుకోవడానికి పొటాషియం నైట్రెట్ ఐదు గ్రాములను ఒక లీటరు నీటిలో కలిపి పంటపై పిచికారి చేయాలని సూచించారు. మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణ కోసం ఏమామెక్టిన్ బెంజోఏట్ 0.3 గ్రాములు లీటరు నీటిలో కలిపి మొక్క అకుల సుడులతో నాలుగు చుక్కలు వేయాలన్నారు.

అభివృద్ధికి సహకరించాలి

గోనెగండ్ల, జూలై 10: గ్రామ పంచాయతీ అభివృద్ధికి అందరు సహకరించాలని ఈవోఆర్డీ నాగేష్, మేజర్ పంచాయతీ సర్పంచ్ హైమావతి, కార్యదర్శి సతీష్ కోరారు. బుధవారం గోనెగండ్ల మేజర్ పంచాయతీ కార్యాలయంలో 8 నెలలకు సంబంధించిన కమేలా, బండిమెట్ట, వారంపు సంతమార్కెట్‌లకు వేలం పాటను పంచాయతీ కార్యదర్శి సతీష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, అనిల్, మలాంగ్ పాల్గొన్నారు.

ఆ గ్రామాల మీదుగా బస్సు నడపాలి

ఆలూరు, జూలై 10: కురుకుంద, ముద్దనగేరి మీదుగా ఆలూరుకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ బుధవారం ఆదోని ఆర్టీసీ డిపో మేనేజర్ మహమ్మద్ రఫీను ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు కలసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మైనా మాట్లాడారు. బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు ఆటోలో ప్రమాదకర ప్రయాణం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. బస్సు సర్వీసును పునఃప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో గోవర్ధన్, గిరిమూర్తి, శశికుమార్, మధు పాల్గొన్నారు.

వీరభద్రగౌడ్ జన్మదిన వేడుకలు

ఆలూరు, జూలై 10: ఆలూరు నియోజవర్గ టీడీపీ సీనియర్ నేత వీరభద్ర గౌడ్ జన్మదిన వేడుకలు బుధవారం ఆలూరులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. టీడీపీ కార్యాలయంలో కార్యకర్తల నడుమ ఆయన కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ రామ్‌నాథ్ యాదవ్, మాజీ జడ్పీటీసీ మీనాక్షినాయుడు, గిరిమల్లేష్ గౌడ్ పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న వీరభద్ర గౌడ్

బాలుడి మృతిపై విచారణ



బాలుని అమ్మమ్మను విచారిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

గోనెగండ్ల, జూలై 10: మండల పరిధిలోని గంజహళ్లి గ్రామంలో బడేసావలి అనే నకిలీ వైద్యుడు వేసిన ఇన్‌జెక్షన్ వికటించి ఆదే గ్రామానికి చెందిన 12 ఏళ్ల బాలుడు రాజేష్ మృతి చెందడంపై బుధవారం డిప్యూటీ డీఎంహెచ్‌వో సత్యవతి, స్థానిక వైద్యులు కార్తీక్ విచారణ చేపట్టారు. బాలుడి అమ్మమ్మ బోయ బస్సమ్మను విచారించి వాస్తవాలను తెలుసుకున్నారు. వైద్యం చేసిన బడేసావలిని కూడా అధికారులు విచారించారు. గ్రామ పెద్దలు పంచాయతీలో చెప్పిన విధంగా రూ.2.50 లక్షలు ఇచ్చానని అధికారులకు తెలిపాడు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌వో సత్యవతి మాట్లాడుతూ ఆర్ఎంపీ, పీఎంపీలు ఎట్టి పరిస్థితులలో ఇన్‌జెక్షన్ వేయరాదని అన్నారు. నివేదికను డీఎంహెచ్‌వోకు పంపుతామని ఆయన నిర్ణయం ప్రకారం చర్యలు ఉంటాయన్నారు.

రాష్ట్రాభివృద్ధే కూటమి లక్ష్యం

దేవనకొండ, జూలై 10: రాష్ట్రాభివృద్ధే టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి లక్ష్యమని జనసేన ఆలూరు ఇన్‌చార్జి వెంకప్ప అన్నారు. బుధవారం స్థానిక మూగితాత ఫంక్షన్ హాల్లో మండలంలోని కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. ప్రజలకు ప్రభుత్వానికి వారధిలా జనసైనికులు మెలగాలన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దృష్టికి ఈ ప్రాంత సమస్యలు తీసుకెళ్లి పరిష్కరిస్తా మన్నారు. కార్యక్రమంలో జగదీష్, మగ్బుల్‌బాషా, కృపాకర్, బడేసాబ్, మహానంది పాల్గొన్నారు.

జింకల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

ఆలూరు, జూలై 10: ఆలూరు నియోజకవర్గంలో ఆస్పరి, దేవనకొండ మండలాల్లో జింకల వల్ల పంటలు దెబ్బతింటున్నాయని, వాటి నియంత్రణకు చర్యలు తీసుకోవాలని అటవీ శాఖ అధికారి శ్యామలకు జనసేన పార్టీ ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకప్ప బుధవారం కలసి విన్నవించారు.. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆలూరులో జింకల పట్టివేతకు ఆపరేషన్ బ్లాక్ బగ్ ఉండేదని, ప్రస్తుతం అది కనిపించడం లేదన్నారు. రైతులు జింకల వల్ల ఎదుర్కొంటున్న సమస్యలు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దృష్టికి కూడా వెళ్ళిందన్నారు. తక్షణమే ఆపరేషన్ బ్లాక్ బగ్‌ను పునరుద్ధరించాలని కోరారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

మద్దికెర, జూలై 10: ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని మాజీ జడ్పీటీసీ సభ్యులు జమేదార్ రాజన్న యాదవ్, పంచాయతీ సలహాదారులు బండారు ఆంజనేయులు, పంచాయితీ సభ్యులు ఎన్.లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం మద్దికెర పంచాయతీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న విజయకుమార్‌ను ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శిగా నియమించారు. బాధ్యతలు తీసుకున్న సందర్భంగా సన్మానించారు. కార్యక్రమంలో ముస్లూరు రామాంజులు, చంద్ర ఉన్నారు.

దేవాలయ ఛైర్మన్ పదవికి రాజీనామా

మద్దికెర, జూలై 10: మండలంలోని శ్రీరంగనాథ స్వామి దేవాలయ ఛైర్మన్ పదవికి ఈడిగ దస్తగిరి గౌడు రాజీనామా చేశారు. బుధవారం ఆలయ ప్రధాన అర్చకులు రంగస్వామికి దేవాలయ ఛైర్మన్‌తోపాటు పాలక మండలి సభ్యులందరూ రాజీనామా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా దస్తగిరి గౌడు మాట్లాడుతూ పదవికి రాజీనామా దేవాలయ అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఇప్పటి వరకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

నిర్మాణ రంగానికి మంచి రోజులు

మద్దికెర, జూలై 10: ఉచిత ఇసుక పాలసీతో నిర్మాణ రంగానికి మంచి రోజులు వచ్చాయని జిల్లా టీడీపీ కార్యదర్శి గూడూరు ధనుంజయుడు, మండల టీడీపీ అధ్యక్షులు శివప్రసాద్ యాదవ్, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు రాఘవేంద్ర అన్నారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఉచిత ఇసుక విధానాన్ని రద్దు చేసి నిర్మాణ రంగాన్ని సర్వనాశనం చేశారన్నారు. ఇసుక ఉచితంగా లభించడం వల్ల నిరుపేదల సొంతింటి కళ నెరవేరుతుందని అన్నారు. భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి దొరుకుతుందని తెలిపారు. సమావేశంలో టీడీపీ నాయకులు చెన్నంపల్లి మల్లికార్జున, భీమరాజు, చాకలి మల్లికార్జునలు ఉన్నారు.

కనీస వేతనం చెల్లించాలి: సీఐటీయూ

వెల్దుర్తి, జూలై, 10: కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలు చేస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనం చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జేనాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ, ఆశావర్కర్, బుక్ కీపర్లు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జే నాగేశ్వరరావు మాట్లాడుతూ లేబర్స్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలన్నారు. అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం, నేషనల్ హెల్త్‌మిషన్, సమగ్రశిక్ష, వెలుగు, మెప్మా, ఉపాధి హామీ, 108, 104 అంబులెన్స్‌ల కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని కోరారు.

అధికారులు ప్రొటోకాల్ పాటించాలి: ఎమ్మెల్యే

పెద్దకడుబూరు, జూలై 10: అధికారులు ప్రొటోకాల్ పాటించాలని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి అన్నారు. బుధవారం పెద్దకడుబూరులోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ శ్రీవిద్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి మాట్లాడుతూ ఎలాంటి అర్హతలేని వారిని ప్రభుత్వ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా పిలిచి, ప్రజా ప్రతినిధులను మరవడం సమంజసం కాదన్నారు. పెద్దకడుబూరు సర్పంచ్ రామాంజనేయులు మాట్లాడుతూ అభివృద్ధి పనుల కోసం నిధులు కేటాయించాలని అన్నారు. సమావేశంలో తెలుగు మహిళా జిల్లా అధ్యక్షు రాలు, జడ్పీటీసీ రాజేశ్వరి, వైస్ ఎంపీపీ ఇర్ఫాన్‌పటేల్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

ఆదోని (అగ్రికల్చర్), జూలై 10: ఉద్యోగలు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతనంగా ఎన్నికైన ఏపీ ఎన్జీవో తాలూకా అధ్యక్షురాలు ఉషారాణి, కార్యదర్శి బజారి, అసోసియేటెడ్ ప్రెసిడెంట్ లక్ష్మి అన్నారు. బుధవారం ఏపీ ఎన్జీవో భవనంలో సాయంత్రం ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి ఆదేశాలతో నూతన కో-ఆప్షన్ కమిటీని ఎన్నుకున్నారు.

అధికారులతో ఎమ్మెల్యే సమావేశం



ఎమ్మెల్యే బీవీని సన్మానిస్తున్న తుంగలి నాగేంద్ర

ఎమ్మిగనూరు, జూలై 10: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి ఆధ్వర్యంలో ప్రజారోగ్యశాఖ అధికారులు ఎస్ఈ శ్రీనాథ్‌రెడ్డి, ఈఈ చంద్రమోహన్‌రావు, డీఈ వెంకటేశ్వర్లుతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రజారోగ్య శాఖలో జరుగుతున్న కార్యక్రమాలపై అధికారులతో చర్చించారు. ఎమ్మిగనూరు పట్టణంలో వీధి కుక్కల నియంత్రణ, పశువుల పరిరక్షణకు చేపట్టాల్సిన జాగ్రత్తలను సూచించారు. కూలేందుకు సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించాలన్నారు. నీటి సరఫరాకు కొత్త పైపులైన్లు, కనెక్షన్లను చేపట్టాలని సూచించారు.

ఎమ్మెల్యే బీవీని కలిసిన తుగ్గలి నాగేంద్ర

శాలివాహన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తుగ్గలి నాగేంద్ర, మాజీ జడ్పీ ఛైర్మన్ బత్తిన వెంకటరాముడులు బుధవారం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఆయనను పూలమాల, శాలువాతో ఘనంగా సత్కరించారు.